## సమగ్ర సర్వేకు ప్రతి ఒక్కరూ సహకరించాలి

-అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

సర్వేను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

**నాగల్‌గిద్ద, నవంబరు 11, ప్రభాతవార్త:** మండల పరిధిలోని పూసాల్‌పాడ్ గ్రామంలో ఎన్యూమరేటర్లు నిర్వహిస్తున్న సమగ్ర కుటుంబ సర్వేను సోమవారం అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు సర్వేకు తమ సంపూర్ణ సహకారం అందించాలని సూచించారు. కుటుంబ సభ్యులు తెలిపే వివరాలను ఎన్యూమరేటర్లు జాగ్రత్తగా తప్పులు లేకుండా నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఓ మహేశ్వరరావు, ఎన్యూమరేటర్లు ఉన్నారు.

## అస్థి కోసం అంత్యక్రియలు నిలిపివేత

**నోటరీ ద్వారా మూడు భాగాలు చేసిన తర్వాత అంత్యక్రియలు**

**చిన్నకోడూరు, నవంబరు 11, ప్రభాతవార్త :** ఇంటి స్థలాన్ని మూడుభాగాలుగా విభజించి రిజిస్ట్రేషన్ చేయాలని వృద్ధురాలి అంత్యక్రియాలు నిలిపివేసిన సంఘటన సోమవారం చిన్నకోడూరులో జరిగింది. గ్రామస్తులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి.గ్రామానికిచెందిన వంగ కిష్టవ్వ(90) ఆదివారం మృతి చెందింది. కిష్టవ్వకు ముగ్గురు కుమారులు, ఒక కూతురు ఉండగా ఇద్దరు కుమారులు మరణించినట్లు తెలిపారు. ఈ క్రమంలో రెండో కుమారుడు రాజేశం తల్లి పేరున ఉన్న ఇంటిని తన పేరుమీద రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని తెలిపారు. తల్లి మరణించడంతో చనిపోయిన కుమారుల కుటుంబీకులు రాజేశం పేరు మీదఉన్న ఇంటి స్థలాన్ని మూడు భాగాలు రిజిస్ట్రేషన్ చేస్తేనే అంత్యక్రియాలు నిర్వహించాలని మొండికేశారు. దీంతో కులపెద్దలు నోటరీ ద్వారా మూడు భాగాలుచేసిన తర్వాత అంత్యక్రియలు నిర్వహించారు. మరణించిన వృద్ధురాలి అంత్యక్రియాలు నిర్వహించాల్సిన కుటుంబీకులు అస్థి కోసం అంత్యక్రియాలు నిలిపి వేయడం పట్ల గ్రామస్తులు ముక్కున వేలుసుకున్నారు.

ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ నగేష్

## జవాబుదారీగా అధికారులు పనిచేయాలి

-జిల్లా అదనపు కలెక్టర్ నగేష్

**సంగారెడ్డి బ్యూరో, నవంబరు 11 ప్రభాతవార్త:** అధికారులు జవాబుదారుగా పనిచేయాలని, రానున్న ప్రజావాణిలో ఏయే శాఖల వద్ద ఎన్ని దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయో తెలపాలని మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో ప్రజల నుంచి అదనపు కలెక్టర్ నగేష్ 65 దరఖాస్తులు స్వీకరించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ రానున్న ప్రజావాణిలో ఏయే శాఖలవద్ద ఎన్ని దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయో తెలపాలని ఆదేశించారు. ఆయాశాఖలకు వచ్చిన దరఖాస్తులు ధరణి-17, డబల్ బెడ్ రూమ్ ఇళ్లు-4, ఇతర సమస్యల-44 అని తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో జడ్పీ సీఈవో ఎల్లయ్య, డీఆర్‌డీవో పీడీ శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## స్విమ్మింగ్ కోచ్‌ను నియమించండి

అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం అందచేస్తున్న విద్యార్థులు

**సంగారెడ్డి, నవంబరు 11, ప్రభాతవార్త:** పట్టణంలోని స్విమ్మింగ్ పూల్‌లో కోచ్‌ను నియమించాలని సోమవారం విద్యార్థులు జిల్లా కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ మాధురికి వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ గత 3 నెలల క్రితం స్విమ్మింగ్ కోచ్‌గా పని చేస్తున్న శ్రీనివాస్‌గౌడ్ పదోన్నతిపై కరీంనగర్‌కు బదిలిపై వెళ్ళినా అతన స్థానంలో మరో కోచ్‌ను నియమించలేదని పేర్కొన్నారు.కోచ్ లేక తాము ఈత నేర్చుకునేందుకు నిత్యం అవస్థలు పడతున్నామని, ప్రమాదం చోటు చేసుకునే అవకాశాలు ఉన్నాయని, అందుకు త్వరగా కోచ్‌ను నియమించాలని వినతి చేశారు.

## ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి : ఆర్డీవో

ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో మైపాల్ రెడ్డి

**కొల్చారం, డిసెంబరు 11 ప్రభాతవార్త:** ధాన్యం కొనుగోళ్ల వేగవంతం చేయాలని నర్సాపూర్ ఆర్డీవో మైపాల్ రెడ్డి అన్నారు. సోమవారం కొల్చారం మండల పరిధిలోని పోతంశెట్టిపల్లి, రాంపూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆర్డీవో మైపాల్ రెడ్డి సందర్శించి, పరిశీలించారు. ధాన్యం కొనుగోళ్ల వేగవంతం చేయాలని, అలాగే ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ ప్రభాకర్, ఐకేపీ సిబ్బంది యాదగిరి, పుల్లబోయిన నర్సింలు, సబిత, ఐకేపీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## జగదేవపూర్ ఎపిఎం, సిసిలపై చర్యలు తీసుకోవాలి



ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

**సిద్దిపేట అర్బన్, నవంబరు 11, ప్రభాతవార్త :** మహిళ విఓఎల పట్ల వేధింపులకు పాల్పడుతున్న జగదేవాపూర్ మండల ఐకెపి ఎపిఎం, సీసీలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సిఐటియూ జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య, ప్రధాన కార్యదర్శి గోపాలస్వామిలు డిమాండ్ చేశారు. సిఐటియూ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ మను చౌదరికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళ విఓఎల పట్ల ఎపిఎం, సిసిలు కక్షగట్టి వేధింపులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ఎపిఎం, సిసిలు అసభ్యంగా ప్రవరిస్తున్నారని వారు మండిపడ్డారు. మహిళా సంఘాలకు బ్యాంకు ద్వారా అందించే బ్యాంకు లోన్ ప్రతి నెల డబ్బులు డిమాండ్ చేస్తున్నారని వారు ఆరోపించారు. విఓఎలను వేధింపులకు గురిచేస్తున్న ఎపిఎం, సిసిలపై చర్యలు తీసుకొని ఇతర మండలాలకు బదిలీ చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కనకయ్య,బిక్షపతిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సుదర్శన్, వినోద, కళ్యాణి, హరిత, నర్సింలు, శ్రీనివాస్‌రెడ్డి, శివదాస్, రమేష్, సంతోష్, శంకర్, కనకయ్య, సరళ, సరిత, కవిత,వసంత, విజయ,అరుణ, లావణ్య, రేణుక,కల్పన,రజిత, మహేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## మల్లికార్జున స్వామికి ప్రత్యేక పూజలు

**వెల్దుర్తి, నవంబరు 11 ప్రభాతవార్త:** మండల పరిధిలోని బస్వాపూర్ లోని శ్రీభ్రమరాంబిక మల్లికార్జునస్వామిఆలయంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీక మాసంలో వచ్చే సోమవారం మంచి రోజుగా భావించి అనుకున్న పనులు జరుగుతాయని భావించి మహిళలు స్వామి వారికి కుంకుమార్చనలు, అభిషేకాలు నిర్వహించారు. దీంతో ఆలయం భక్తులతో కిటకిటలాడింది. కోరిక కోరికలు తీర్చే భ్రమరాంబ మల్లికార్జున స్వామికి భక్తులు మొక్కులను తీర్చుకున్నారు.

# సమగ్రాభివృద్ధికి కుటుంబ సర్వే దోహదం

**మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**

సమగ్ర ఇంటింటి సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్

**పెద్దశంకరంపేట, నవంబరు 11 ప్రభాతవార్త:** సమగ్రాభివృద్ధికి సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కులసర్వే ఉపయోగపడుతుందని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. సోమవారం పెద్దశంకరంపేటలో కొనసాగుతున్న ఇంటింటి సర్వేను జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రగతి ప్రణాళికల రూపకల్పనకు జరుగుతున్న సర్వేలో ఎన్యూమరేటర్లు సేకరించిన డేటా ఎంట్రీ పకడ్బంధీగా నిర్వహించాలన్నారు. డేటా ఎంట్రీ నమోదు చాలా గోప్యంగా జరగాలని, నమోదు చేసే సమయంలో ఇతరులను అనుమతించొద్దని, పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను నియమించాలని సూచించారు. ఇంటింటి సర్వే ప్రక్రియలలో వేగం పెంచాలని స్పష్టం చేశారు. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా కుటుంబం సమగ్ర సమాచారాన్ని నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. సర్వే సమగ్రాభివృద్ధికి తొలి మెట్టు అని, దీని ద్వారా ఆర్హులైన ప్రజలకు ఏది అవసరమో, ఎలా అమలు చేయాలనే అంశాలపై ప్రణాళికలు రూపకల్పన జరుగుతుందన్నారు. ప్రణాళికలు లేకుండా అభివృద్ధి సాధ్యం కాదని, ప్రజలు సర్వే సిబ్బందికి కుటుంబ సమగ్ర సమాచారం ఇవ్వాలని కోరారు. జిల్లాలో కుటుంబాల వారీగా ప్రజల ఆర్థిక స్థితిగతులు తదితర అంశాలన్నింటినీ సమగ్రంగా సేకరించే ఉద్దేశంతోనే ప్రభుత్వం ఎంతో ఆలోచన చేసి ప్రతిష్టాత్మకంగా సర్వే చేపట్టినట్లు తెలిపారు. సర్వే నిర్వహణ తీరును సూపర్ వైజర్లు, నోడల్ అధికారులు, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు.ప్రతి ఎన్యుమరేటర్ రోజుకు పది ఇళ్లను సర్వే చేయాలని లక్ష్యాన్ని నిర్దేశించినట్లు తెలిపారు. ఎన్యుమరేటరుకు క్షేత్రస్థాయిలో ఇబ్బందులు తలెత్తకుండా సర్వేకిట్లు అందించామని, బుక్‌లెట్‌లో ఇచ్చిన కోడ్స్ నమోదులో ఎలాంటి పొరపాట్లుకు తావులేకుండా పకడ్బందీగా వ్రాయాలని సూచించారు. రోజువారీగా జరిగిన సర్వే వివరాలను ఎంపీడీఓ కార్యాలయంలో ఆన్లైన్ చేయనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఇందుకోసం ప్రతి మండలానికి అవసరమైన డేటా ఎంట్రీ ఆపరేటర్లను నియమించామని తెలిపారు. ప్రజలు ఇచ్చిన వివరాలను ఇతరులెవరికీ ఇవ్వమని, ఆధారాలు చూపించాలని, ఎన్యుమరేటర్లు ప్రజలు పట్ల భాద్యతగా వ్యవహరిస్తారని, ప్రజలు స్వచ్ఛందంగా సమాచారమందించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ గ్రేసీబాయ్, ఎంపీడీవో రఫీక్‌ఉన్నీసా, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ రమేష్, ఈఓ వెంకట్రాములు తదితరులు పాల్గొన్నారు.

ఆబ్దుల్‌కలాంఆజాద్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

## మహనీయుడు మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్

**మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ నగేష్**

**సంగారెడ్డి బ్యూరో, నవంబరు 11 ప్రభాతవార్త:** ప్రతి పేదవారు ఉన్నత విద్యను అభ్యసించాలని భావించి, దానికి అనుగుణంగా విద్యా సంస్థలను ఏర్పాటు చేసిన భారత తొలి విద్యా శాఖ మంత్రి మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ అని మెదక్ జిల్లా అదనపుకలెక్టర్ మెంచు నగేష్ పేర్కొన్నారు.సోమవారం మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ 136వ జయంతిని పురస్కరించుకొని కలెక్టరేట్‌లో జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ నగేష్, సంబంధిత ఇతర శాఖల అధికారులు, మైనారిటీ పెద్దలతో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన గావించి మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారతదేశంలో సాహిత్యం, విద్యా వికాసాలకు కృషి చేసిన వ్యక్తిగా, చరిత్రపుటలకెక్కిన మహనీయుడు మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి జమ్లా నాయక్, ఏవో యూనిస్, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డిఆర్డిఏ పిడి శ్రీనివాసరావు, బీసీ సంక్షేమ అధికారి నాగరాజుగౌడ్, ఇంటర్మీడియట్ అధికారి మాధవి, గిరిజన సంక్షేమ అధికారి, సంబంధిత ఇతర శాఖల అధికారులు, మైనారిటీ సంక్షేమశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పొజిషన్‌లో ఉన్నవారికి ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలి

**-అడిషనల్ కలెక్టర్ మాధురికి వినతి పత్రం అందజేసిన బీకేఎంయూ**

**సదాశివపేట, నవంబరు 11 ప్రభాతవార్త:** సంగారెడ్డి జిల్లా సదాశివపేట లోని సర్వేనెం. 260లో పూరి గుడిసెల వేసుకుని పొజీషన్‌లో ఉన్నవారికి పట్టాలు మంజూరు చేయాలని సోమవారం బీకేఎంయూ ఆధ్వర్యంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ మాధురికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీకేఎంయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వినోద్, తాజుద్దీన్ మాట్లాడుతూ ఏడు సంవత్సరాల క్రితం పూరి గుడిసెలు వేసుకొని అక్కడే నివసిస్తున్న పేదలకు పట్టాలు మంజూరు చేయాలని గత ప్రభుత్వ హయాంలో అనేక దఫాలుగా మొర పెట్టుకున్నప్పటికీ మంజూరు కాలేదని, గత ఎన్ని కల ముందు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే పేదలు వేసుకున్న గుడిసె లకు పట్టాలు మంజూరు చేస్తామని, అలాగే స్థలంఉండి ఇల్లు కట్టుకోలేని స్థితిలో ఉన్నవారికివారికి గృహ నిర్మాణానికి రూ. ఆరు లక్షల ఇస్తామని హామీ ఇచ్చారని, ఆ హామీని రాష్ట్ర ప్రభుత్వం నిలబెట్టుకోవాలని వారు డిమాండ్ చేశారు. అక్కడ ఎలాంటి మౌలిక సదుపాయాలు లేకున్నా, ఎండకు, వానకు, చలికి అక్కడే ఉంటూ జీవితాలు వెల్లదీస్తున్న నిరుపేదలకు వెంటనే రాష్ట్ర ప్రభుత్వం పొజీషన్ పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పాండు, అజిత్ ఖాన్, వీరేశం, యాకబ్ అలీ, సాదిక్ అలీ, టేకు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పక్కన చెత్తను తొలగిస్తున్న గ్రామపంచాయతి సిబ్బంది

వార్తకు స్పందన

## రోడ్డుపక్కన చెత్త తొలగించిన అధికారులు

**దూళ్మిట్ట, నవంబరు 11, ప్రభాతవార్త :** దూళ్మిట్ట మండలం జాలపల్లి నుండి నంగనూరు వెళ్లే రోడ్డు పక్కన చెత్త డంపు చేసి కాల్చి వేయడంతో వాహనాదారులు ఇబ్బందులకుగురవుతున్నారని నిన్న 'ప్రభాతవార్త'లో 'రోడ్డు పక్కనే చెత్తా..ఇట్లాయితే ఎట్లా...'అనే శీర్షిక వెలువడటంతో సంబంధిత అధికారులు స్పందించారు. సోమవారం జాలపల్లి గ్రామ శివారులో ఉన్న డంపింగ్‌యార్డ్,శ్మశానవాటికల స్థలాన్ని తహసీల్దార్ మదుసూదన్ పరిశీలించి పూర్తి స్థాయిలో సర్వేయర్‌తో హద్దులు ఏర్పాటు చేసి గ్రామపంచాయతి అధికారులకు గాని, ఎంపిడీవోకుగాని నివేదికను అందించి చెత్తను ప్రభుత్వం కేటాయించిన స్థలంలోనే వేసేలా చూస్తామని ప్రభాతవార్తతో తెలిపారు. అనంతరం గ్రామపంచాయతి కార్యదర్శి పున్న శ్రీనివాస్ గ్రామపంచాయతి సిబ్బందితో వెళ్ళి రోడ్డు పక్కన ఉన్న చెత్తా,చెదారాన్ని తెలగించారు.

## చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

**జాతీయ న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రమేష్**

**సంగారెడ్డి బ్యూరో నవంబరు 11, ప్రభాతవార్త:**

జాతీయ న్యాయ సేవాధికార సంస్థ మరియు రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల ప్రకారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ మరియు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. భవానిచంద్ర ఆదేశాల మేరకు, సోమవారం స్థానిక సెయింట్ ఆంథోనీ జూనియర్ మరియు డిగ్రీ కళాశాలలో జాతీయ న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. రమేష్ ఆధ్వర్యంలో న్యాయ అవగాహనా సదస్సు నిర్వహించడం జరిగింది.న్యాయ అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. రమేష్ మాట్లాడుతూ విద్యార్థులు అన్ని చట్టలపైనా అవగాహనా ఉండాలి అన్నారు.. న్యాయ వ్యవస్థలో ఎలా ఉండాలో వివరించి చెప్పారు. గృహ హింస, బాల్య వివాహ నిషేధ చట్టం, పోస్కో చట్టం, వరకట్న నిషేధ చట్టాలపై అవగహన కలిగి ఉండాలి అన్నారు. విద్యార్థులకు, ఉపాధ్యాయులు న్యాయ పరమైన విషయాలలో ఉచిత న్యాయ సహాయం అందిస్తామని ఏదైనా న్యాయ సహాయం కోరినచో న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయం, సంగారెడ్డిని సంప్రదించగలన్నారు.ఈ సదసుంసలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీ బి. రమేష్ గారు, ప్రిన్సిపాల్ ,ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రూప్-3 పరీక్షను విజయవంతంగా పూర్తి చేయాలి

**-అభ్యర్థులు పరీక్ష కేంద్రాన్ని ముందే చూసుకోవాలి.. మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ నగేష్**

**సంగారెడ్డి బ్యూరో, నవంబరు 11 ప్రభాతవార్త:** గ్రూప్-3 పరీక్షను విజయవంతంగా పూర్తిచేయాలని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ అధికారులను ఆదేశించారు. ఈ నెల 17, 18వ తేదీలలో నిర్వహించే గ్రూప్-3 పరీక్షపై సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని మీటింగ్ హాల్‌లో జిల్లా అడిషనల్ ఎస్పీ మహేందర్‌తో కలిసి అదనపు కలెక్టర్ నగేష్ సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 17, 18వ తేదీలలో ఉదయం 10 గంటలనుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, మధ్యాహ్నం 3.00 గంటల నుండి సాయంత్రం 5.30 గంటల వరకు కొనసాగే గ్రూప్-3 పరీక్షకు జిల్లాలో 5,867 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని తెలిపారు. అభ్యర్థుల సంఖ్యకు అనుగుణంగా జిల్లాలో 19 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని వివరించారు. ఫ్లయింగ్ స్క్వాడ్‌లు-6, రూట్ ఆఫీసర్స్-6, డిపార్ట్మెంట్ ఆఫీసర్స్-19 మంది విధులు నిర్వహిస్తారని తెలిపారు. కేవలం చీఫ్ సూపరింటెండెంట్ మినహా ఎవరూ పరీక్ష కేంద్రంలోకి మొబైల్ ఫోన్ తీసుకెళ్లవద్దని స్పష్టం చేశారు. ప్రతి కేంద్రంలో మహిళలు, పురుషులకు వేరువేరుగా తనిఖీ గదులు ఏర్పాటు చేయాలని సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తూ, పరిసర ప్రాంతాల్లోని జిరాక్స్ సెంటర్‌లను మూసి ఉంచాలని, ఆర్టీసీ అధికారులు అభ్యర్థుల సంఖ్యకు అనుగుణంగా బస్సులు నడిపించాలని, అధికారులు విద్యుత్ సరఫరాలో లోపం లేకుండా ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించారు. వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పరీక్ష కేంద్రాల వద్ద వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మందులు ఉంచాలని సూచించారు. అదే విధంగా ప్రతి పరీక్షా కేంద్రం వద్ద మంచి నీరు, టాయిలెట్లు సక్రమంగా ఉండేలా ఏర్పాట్లు చేశామని తెలిపారు. అడిషనల్ ఎస్పీ మహేందర్ మాట్లాడుతూ గ్రూప్-3 పరీక్షను జిల్లాలో పకడ్బందీగా నిర్వహించడానికి పోలీస్ నోడల్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 19 పరీక్షా కేంద్రాలకు గాను 16 లొకేషన్స్ ఏర్పాటు చేసినట్లు మెదక్ సబ్ డివిజన్‌లో 12 పరీక్షా కేంద్రాలు నిర్వహించగా, తూప్రాన్ సబ్ డివిజన్లో 7 సెంటర్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షా పేపర్లు భద్రపరచేందుకు స్ట్రాంగ్ రూము ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పరీక్ష నిర్వహణకు పటిష్టమైన ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. ఒక్కో సెంటర్‌కు 5 మంది పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి అందరి సమన్వయంతో పటిష్ట భద్రత నడుమ పరీక్షలు విజయవంతంగా కొనసాగడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ సమావేశంలో మెదక్ ఆర్డీవో రమాదేవి, నర్సాపూర్ ఆర్డీవో మహిపాల్‌రెడ్డి, తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి, జడ్పీ సీఈవో ఎల్లయ్య, డీఆర్‌డీవో పీడీ శ్రీనివాసరావు, పలువురు జిల్లా అధికారులు, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

**అభ్యర్థులకు సూచనలు...**

పరీక్షా సమయానికి గంటన్నర ముందు నుంచే అభ్యర్థులను హాల్లోకి అనుమతిస్తారు. పరీక్షకు అర గంట ముందే గేట్లు మూసివేస్తారు. అభ్యర్థులు కేవలం చెప్పులు ధరించాలి. బూట్లు వేసుకుని రాకూడదు. బయోమెట్రిక్ తప్పనిసరి. పరీక్ష కేంద్రంలో ప్రవేశించిన అభ్యర్థి నుంచి బయోమెట్రిక్ వేలి ముద్రలు సేకరిస్తారు. బయోమెట్రిక్ పూర్తయ్యే వరకు అభ్యర్థులెవరూ పరీక్ష కేంద్రం నుంచి బయటకు వెళ్లడానికి వీల్లేదు. అభ్యర్థుల సౌకర్యార్థం అర గంటకు ఒకసారి బెల్ మోగించి పరీక్ష సమయాన్ని తెలియజేస్తారు. అవసరమైతే ఇన్విజిలేటర్లను అడిగి సమయం తెలుసుకోవచ్చు. అభ్యర్థులు పరీక్ష ముగిసే వరకు పరీక్ష కేంద్రాన్ని విడిచి వెళ్లకూడదు అని వివరించారు.

కెటిఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే సునీతారెడ్డి, బిఆర్ఎస్ నాయకులు

## మాజీ మంత్రులను కలిసిన ఎమ్మెల్యే

**నర్సాపూర్, నవంబరు 11, ప్రభాతవార్త:** మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావును,బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావులను సోమవారం ఎమ్మెల్యే సునీతారెడ్డి వేరువేరుగా హైదరాబాద్ లోని గచ్చిబౌలిలో హరీష్‌రావును, తెలంగాణా భవన్‌లో కెటిఆర్‌ను బిఆర్ఎస్ నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి నియోజకవర్గస్థాయి బిఆర్ఎస్ పార్టీ శ్రేణులతో మర్యాదపూర్వకంగా కళిశారు. ఈనెల 9న కొల్చారంలో సునీతారెడ్డి అధ్యక్షతనలో తలపెట్టిన రైతు నిరాహారదీక్ష విజయవంతం కావడంతో కెటిఆర్ బిఆర్ఎస్ పార్టీ శ్రేణులను అభినందించారు. రాబోయే కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 6 గ్యారంటీల హామీలు అమలయ్యేవరకు బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమించాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్‌నాయకులు దుర్గారెడ్డి, సత్యంగౌడ్, రింగుల ప్రసాద్, షేక్‌హుస్సేన్, ఎల్లమయ్య, గుంజరి ప్రవీణ్, నరహరి, కాంతారావు, రాజు, నవీన్, శేఖర్, పోచయ్య, చక్రి, లక్ష్మణ్, ప్రభు తదితరులు పాల్గొన్నారు

## సుడా వేలం పాటలకు స్పందన కరువు

వేలం పాటలు నిర్వహిస్తున్న సుడా వైస్ చైర్మన్ అశ్రిత్‌కుమార్

**సిద్దిపేట అర్బన్, నవంబరు 11, ప్రభాతవార్త :** సిద్దిపేట అర్బన్ డెవలప్ మెంట్ అథారటీ ఆధ్వర్యంలో మిట్టపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన ప్లాట్ల వేలానికి స్పందన కరువైంది. 98 ప్లాట్లకు వేలంవేయగా ఏడుగురు మాత్రమే వేలంపాటలో పాల్గొన్నారు. అందులో ఒకే వ్యక్తి మూడు ప్లాట్లు, మరో వ్యక్తి రెండు ప్లాట్లను దక్కించుకోగా మిగిలిన వారు ఒక్కోప్లాట్ చొప్పున దక్కించుకున్నారు. ఈ సందర్భంగా సుడా వైస్ చైర్మన్, సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ అశ్రిత్‌కుమార్ మాట్లాడుతూ వేలంపాటలో ప్లాట్లను దక్కించుకున్న వారు వారంలో 25శాతం డబ్బులు చెల్లించాలన్నారు. మిగతా డబ్బులను రెండు నెలల్లో పూర్తిగా చెల్లించాలన్నారు. ఈనెల 20న మళ్లీ వేలం పాట నిర్వహించడం జరుగుతుందని ఆసక్తిగల వారు సుడా ఆఫీసులో సంప్రదించాలన్నారు.

**సుడా ఆఫీస్ ఎదుట భూ బాధితుల నిరసన**

సుడా ఆఫీసులో సుడా వెంచర్‌కి సంబంధించిన వేలం పాట జరుగుతున్న విషయాన్ని తెలుసుకున్న మిట్టపల్లి గ్రామానికి చెందిన బాధితులు వడ్లకొండ సతీష్, అఖిల్‌గౌడ్‌లు కుటుంబ సభ్యులతో కలిసి కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. సుడా వెంచర్‌కు సంబంధించి తమకు ఎలాంటి పరిహారం అందలేదని అక్కడి భూములతో సంబంధం లేని వ్యక్తులకు ప్లాట్లను ఇవ్వడంతో పాటు పరిహారం ఇచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు.

## చట్ట సభల్లో మహిళా రిజర్వేషన్ చట్టం సవరించాలి

**ఎన్ఎఫ్ఐడబ్ల్యు రాష్ట్ర అధ్యక్షురాలు సృజన**

**సిద్దిపేట రూరల్, నవంబరు 11, ప్రభాతవార్త :** కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో చర్చలకు అనుమతి లేకుండా నారీ శక్తి వందన్ అభినియం(చట్టం) పేరుతో రాజ్యాంగంలోని 128వ సవరణ ద్వారా బిల్లును అమోదింప చేయడం సరికాదని ఎన్ఎఫ్ఐడబ్ల్యు రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్తేల సృజన అన్నారు. జిల్లా కేంద్రంలో సోమవారం ఎన్ఎఫ్ఐడబ్ల్యు సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎడ్ల గురువారెడ్డి భవనం వద్ద జెండాను ఆవిష్కరించి ఆమె మాట్లాడారు. బిల్లు ద్వారా మహిళాలకు చట్ట సభల్లో రిజర్వేషన్ అమలు చేయాలంటే షరతులు వర్తిస్తున్నాయని..చట్టం మహిళాలకు ఎలాంటి ఉపయోగం లేదన్నారు. చట్టసభలలో మహిళా రిజర్వేషన్

Main-II(MDk)-NOV 11:Main-II(MDk)-NOV 11.qxd 11/11/2024 8:48 AM Page 1



## రైతులను దగా చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం

గవ్వలపల్లి చౌరస్తాపై నిరసన వ్యక్తం చేస్తున్న వివిధ పార్టీల నాయకులు

**చిన్నశంకరంపేట, నవంబరు 11,ప్రభాతవార్త:** ధాన్యం కొనుగోలు చేయకుండా జాప్యం చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను దగా చేస్తుందని వివిధ పార్టీల నాయకులు ఆరోపించారు. సోమవారం మండల పరిధి గవ్వలపల్లి చౌరస్తాలో మెదక్ - చేగుంట ప్రధాన రహదారిపై ధాన్యం కొనుగోలు చూయాలని రైతులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తరలించి నెల రోజులు గడుస్తున్నప్పటికి నిర్వాహకులు మాత్రం తూకం చేయడంలేదని, టార్పలిన్ల కిరాయి మీద పడి అన్నదాత తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. కొన్ని కేంద్రాలలో సన్నరకం ధాన్యం తూకం ప్రారంభం కాలేదని, సన్నాలకు రూ.500ల బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. రెండు రోజుల్లో పూర్తి స్థాయి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ప్రారంభం కాకపోతే ప్రభుత్వ కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. గంటపాటు నిరసన చేయడంతో ఇరువైపులా వాహనాలు భారీగా నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చెరుకొని రైతులను వివిధ పార్టీల నాయకులను సముదాయించి నిరసనను విరమింపచేశారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు రాజు, నాగరాజు, శంకర్, శేఖర్, నరేందర్, రమేష్, శ్యాం, కుమార్, నర్సింలు వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## సర్వేను పరిశీలించిన అదనపు కలెక్టర్

కమాలాపూర్‌లో సర్వేను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

**మనూర్, నవంబరు 11, ప్రభాతవార్త:** మండల పరిధిలోని కమలాపూర్‌లో కొనసాగుతున్న సమగ్ర కుటుంబ సర్వేను సోమవారం అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ పరిశీలించారు. సర్వేకు ప్రతి ఒక్కరు తమ వంతు సహకారం అందించాలని చంద్రశేఖర్ జిల్లా ప్రజలకు సూచించారు. వివరాలను సక్రమంగా తప్పులు లేకుండా నమోదు చేయాలని ఎన్యూమరేటర్లకు అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ సూచించారు. కార్యక్రమంలో ఎంపిడిఓ అలివేలు మంగ, తహసీల్దార్ వెంకటస్వామి, పంచాయితీ కార్యదర్శి ఎన్యూమరేటర్‌లు డి.నర్సింలు, సునీల్‌కుమార్ తదితరులు ఉన్నారు.

## శివపంచాక్షరి ఉత్సవంలో ఎమ్మెల్యే దంపతులు



శివపంచాక్షరి మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే దంపతులు

**నారాయణఖేడ్ టౌన్, నవంబరు 11, ప్రభాతవార్త:** పట్టణంలోని తమ నివాస గృహంలో సోమవారం నిర్వహించిన శివపంచాక్షరి జపయజ్ఞ సహిత శ్రీ గురుపాదుకార్చన మహోత్సవ పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి తన ధర్మపత్ని పట్లోళ్ల అనుపమరెడ్డితో కలిసి పాల్గొన్నారు. మహేశ్వర శర్మ సిద్ధాంతి ఆధ్వర్యంలో నిర్వహించిన పూజల్లో ఎమ్మెల్యే దంపతులు భక్తిశ్రద్ధలతో పూజల్లో పాల్గొన్నారు. పూజా కార్యక్రమంలో శ్రీగురుపాదుకార్చనా స్వాములు ఎమ్మెల్యే దంపతులకు ఆశీర్వచనాలు చేశారు. కార్యక్రమంలో డిసిసి ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకులు పట్లోళ్ల సుధాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## కులగణన ఒక నాటకం

**-బిఆర్ఎస్ నేత వెంకట్‌రెడ్డి**

**ఝరాసంగం, నవంబరు 11, ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న కుల గణన ఒక నాటకం అని బిఆర్ఎస్ మండల నాయకులు బి వెంకట్‌రెడ్డి విమర్శించారు. సోమవారం వెంకట్‌రెడ్డి స్థానిక విలేఖరులతో మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా చేసిన 6గ్యారంటీలను అమలు చేయలేకపోతున్న ప్రభుత్వం ప్రజలను మభ్యపెట్టేందుకు, ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో కోత పెట్టేందుకే కులగణన సర్వే చేస్తున్నట్లు ఆరోపించారు.

## ఎమ్మెల్యేపై వ్యక్తిగత విమర్శలు మానాలి

**శివ్వంపేట,నవంబర్ 11 ( ప్రభాతవార్త):** కాంగ్రెస్ పార్టీ నాయకులు నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డిపై వ్యక్తిగత విమర్శలు మానుకోవాలి అని మాజీ జిల్లా కోఆప్షన్ సభ్యులు మన్సూర్ అన్నారు. సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టి నాయకులు విమర్శలు మానుకోని ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలు చేయాకుండా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సుమారు సంవత్సరం గడిచిన హమిలు మరిచిపోయి విమర్శలు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. గత ప్రభుత్వం హయంలో అన్ని వర్గాల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కృషి చేసింది అని ఆయన అన్నారు. విమర్శలు మానుకోని నర్సాపూర్ నియోజకవర్గానికి అభివృద్ధి చేసేందుకు సహకరించాలని అన్నారు. ఎమ్మెల్యే సునీతారెడ్డిపై వ్యక్తిగత విమర్శలు మానుకోకపోతే బిఆర్ఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని అన్నారు.

### విధులను బహిష్కరించిన రెవెన్యూ సిబ్బంది

**నవాబుపేట,నవంబరు 11 ప్రభాతవార్త:** జిల్లా పరిధిలోని దుద్యాల మండలం లగచర్లలో జిల్లాకలెక్టర్, తదితర అధికారులపై సోమవారం స్థానిక ప్రజలు కొందరు దాడిచేసిన ఘటనకు నిరసనగా మండల తహశీల్దార్ కార్యాలయానికి తాళంవేసి సిబ్బంది విధులను బహిష్కరించారు. ఈనేపథ్యంలో పలుపనులు నిలిచిపోయాయి. రిజిస్ట్రేషన్లు కూడా నిలిపోవడంతో సుదూర ప్రాంతాలనుండి వచ్చిన కొనుగోలుదారులు, విక్రయదారులు కొంత ఇబ్బందికి గురైయ్యారు. ఇదివరకు ఇలాంటి ఘటన ఎప్పుడు చోటుచేసుకోక పోవడంతో ఈ విషయం చర్చనీయాంశమైయింది. ముఖ్యంగా కలెక్టర్ స్థాయి అధికారులపై విచక్షణ రహితంగా దాడి చేయడంపై ఎక్కడ చూసినా ఇదే చర్చ జరిగింది.

### అనాలోచిత నిర్ణయాల వల్లే కలెక్టర్‌పై దాడి

**షాద్‌నగర్, ప్రభాతవార్త, నవంబరు 11 :** వికారాబాద్ జిల్లా కలెక్టర్‌పై లగచర్ల గ్రామస్థుల దాడి గర్హనీయమని షాద్‌నగర్ బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు, మున్సిపల్ వైస్ చైర్మన్ ఎం.ఎస్.నటరాజన్ ఖండించారు. ఫార్మా కంపెనీ భూముల కోసం గ్రామస్థులతో, రైతులతో మాట్లాడడానికి వెళ్లిన వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, రెవెన్యూ అధికారులపై మహిళలు, రైతుల దాడి ఆక్షేపణీయమని అన్నారు. అధికారుల వాహనాలపై దాడి చేసి చర్చల కోసం వచ్చిన ఐఎఎస్ అధికారిపై దాడులు సరికావని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో నిరసన, ఆందోళన తెలుపవచ్చని, కానీ అది శృతిమించకూడదని పేర్కొన్నారు. ప్రతీక్ జైన్ ఒక మంచి అధికారి అని నటరాజన్ పేర్కొన్నారు.

## పంటకోసే సమయంలో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి..

**-ఇంచార్జి వ్యవసాయ సంచాలకులు రాజ్‌నారాయణ**

రైతులకు సూచనలు ఇస్తున్న ఇంచార్జి వ్యవసాయ సంచాలకులు రాజ్‌నారాయణ

**రామాయంపేట మున్సిపాలిటీ, నవంబరు 11, ప్రభాతవార్త:** రామాయంపేట మండల వ్యాప్తంగా 60శాతం వరకు వరిపంట కోతలు పూర్తయ్యాయని, పంటకోసే సమయంలో రైతులు కొన్ని జాగ్రత్తలు తీసుకున్నట్లయితే, నాణ్యమైన పంట దిగుబడులు పొందే అవకాశం ఉందని రామాయంపేట ఇంచార్జి వ్యవసాయ సంచాలకులు రాజ్‌నారాయణ తెలిపారు. సోమవారం రామాయంపేట మండల పరిధిలోని దంతేపల్లి తీన్‌నంబర్ తండా, జమ్లతండా పరిధిలో జరగుతున్న వరి కోతలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన హార్వెస్టర్ ద్వారా వరి కోసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు రైతులకు వివరించారు. పూర్తి పక్వానికి వచ్చిన వరిని మాత్రమే కోయాలని హార్వెస్టర్ వేగాన్ని 18 నుండి 19 ఆర్పీయం ఉండే విధంగా చూసుకోవాలన్నారు. హార్వెస్టర్‌లోని బ్లోయర్లు (గాలి ఊదే పరికరం) ఆన్‌లో ఉంచాలని, గేర్ సెట్టింగును ఎ2 నుండి బి1కు సర్దుబాటు చేయాలని వివరించారు. ఈవిషయాలను రైతులు హార్వెస్టర్ యాజమానులకు, డ్రైవర్లకు పంటకోత ముందే సూచించినట్లయితే నాణ్యమైన ధాన్యం కోసం అవకాశం ఉందన్నారు. అదే విధంగా హార్వెస్టర్ పొలంలో తిరిగేటప్పుడు కరెంటు తీగలకు తగలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఏదైనా సూచనలను హార్వెస్టర్ డ్రైవర్‌కు తెలియజేయాలనుకుంటే వరి కోసే ముందే తగు సూచనలు చేయాలని, ఎందుకంటే హార్వెస్టర్ శబ్దానికి డ్రైవర్‌కు సరిగ్గా వినపడే అవకాశం ఉండదని అన్నారు. హార్వెస్టర్లు 10 నుండి 15 మీటర్ల దూరంలో మాత్రమే రైతులు ఉండాలని, లేనట్లయితే ప్రమాదాలకు లోనయ్యే అవకాశం ఉందన్నారు. కోసిన ధాన్యాన్ని తగు జాగ్రత్తలు పాటిస్తూ, ఇతరులకు ఇబ్బంది కలగకుండా ఆరబెట్టుకోవాలని, రోడ్లపై ఆరబెట్టడం ద్వారా వాహనదారులు రోడ్డు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంటుంది కాబట్టి, రైతులు జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

## నేడు విద్యుత్ సరఫరా బంద్

**మేడ్చల్, నవంబర్ 11. ప్రభాతవార్త :** గుండ్లపోచంపల్లి మున్సిపల్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో నేడు కరంట్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ గుండ్లపోచంపల్లి ఏఈ విజయ్ కుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నాడు. సబ్‌స్టేషన్ పరిధిలోని నైబర్‌హుడ్ ఫీడర్‌లో మరమ్మత్తులు చేపడుతున్నందున మున్సిపాలిటీలోని లక్ష్మీ నగర్, మైని నగర్, ట్రిడెంట్ అమార్ట్‌మెంట్స్, ఊర్జిత విల్లాస్, నైబర్‌హుడ్ విల్లాస్, ఎజిసైట్ ప్రాంతాల్లో నేడు ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు కరంట్ సరఫరా ఉండదని తెలిపారు. ఈ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరాడు. మేడ్చల్‌లో...మేడ్చల్ పట్టణ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని కంట్రీ క్లబ్ ఫీడర్ పరిధిలో నేడు కరంట్ సరఫరా ఉండదని విద్యుత్ శాఖ పట్టణ ఏఈ ఓ ప్రకటనలో పేర్కొన్నాడు. కంట్రీ క్లబ్ ఫీడర్ పరిధిలో వైర్లకు తాకుతున్న చెట్ల కొమ్మలు తీసివేస్తున్న సందర్భంగా పట్టణంలోని సాయిబాబ నగర్, ఏయిర్‌ఫోర్స్ కాలనీ, వీకర్ సెక్షన్ కాలనీ, స్టేషన్ రోడ్డు, సరస్వతి నగర్, సత్య నగర్, గిర్మాపూర్ రోడ్డు, మెట్రో లైన్ మార్క్ ప్రాంతాల్లో నేడు ఉదయం 11 గంటల నుండి మద్యాహ్నం 3 గంటల వరకు కరంట్ సరఫరా ఉండదని, అందుకు వినియోగదారులు సహకరించాలని కోరాడు.

## బిజెపి నేత కేశవరెడ్డికి నివాళి

**మేడ్చల్, నవంబర్ 11. ప్రభాతవార్త :** బిజెపి రాష్ట్ర నాయకుడు కేశవరెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయనకు బిజెపి, వివిదపార్టీల నేతలు నివాళులర్పించారు. మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని అత్వెల్లిలో గల ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన వర్ధంతిలో నాయకులు ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు విక్రంరెడ్డి, రాష్ట్రనాయకులు నందారెడ్డి,మల్లారెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ మోహన్‌రెడ్డి,జిల్లాఉపాధ్యక్షుడు జగన్‌గౌడ్, నాయకులులక్ష్మారెడ్డి, రాఘవరెడ్డి,సాయినాథ్‌రెడ్డి, వివిధ పార్టీల నేతలు కొండల్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, వీరభద్రారెడ్డి, మల్లేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధిని చూసి ఓర్వలేక దాడులు

**కొడంగల్, నవంబరు 11ప్రభాతవార్త :** గతంలో ఎన్నడూ లేని విధంగా కొడంగల్‌లో జరుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే బీఆర్ఎస్ దాడులను ప్రోత్సహిస్తున్నదని యువజన కాంగ్రేస్ జాతీయ కోఆర్డినేటర్ కృష్ణరాజు,నాయకులు రెడ్డి శ్రీనివాస్,టీపీసీసీ ప్రతినిది ఎండీ.యుసుఫ్ తదితరులు ఆరోపించారు. సోమవారం వారు స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతు ఫార్మ కంపెనీల ఏర్పాటుపై ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్ళిన జిల్లా కలెక్టర్,కడా అధికారిపై దాడులను వారు తీవ్రంగా ఖండించారు.ఫార్మా కంపెనీ ఏర్పాటుపై ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్ళిన జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్,కడా అధికారి వెంకట్‌రెడ్డిలపై జరిగిన దాడుల వెనుక బీఆర్ఎస్ పార్టీ నాయకులు ప్రోత్సహం ఉందని ఆరోపించారు.గత 10 సంవత్సరాల పాలనలో బీఆర్ఎస్ పార్టీ కొడంగల్ అభివృద్ధిని పట్టించుకోలేదని,ప్రస్తుతం సీఎం రేవంత్‌రెడ్డి రూ.5వేల కోట్లతో నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తుంటే ఎక్కడ తమ ఉనికి కోల్పోతామోనని అక్కసుతో అమాయకులపై ప్రజలను ఉసిగొల్పుతున్నారని దాడులకు పాల్పడుతున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్ డైరెక్షన్‌లో మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అడుతున్న డ్రామాలు అంటూ ధ్వజమెత్తారు. కార్య క్రమంలో కాంగ్రేస్ నాయకులు మున్సిపల్ కౌరన్సిలర్ శంకర్‌నాయక్, దాము, అర్గె ఓంప్రకాష్ పాల్గొన్నారు.

## సర్వేకు సహకరించాలి

**జిల్లెడుచౌదరిగూడ, నవంబర్ 11,(ప్రభాతవార్త):** గ్రామాల్లోని ప్రజలు ప్రభుత్వం నిర్వహిస్తున్న సమగ్ర కుల గణన సర్వేకు పూర్తి స్థాయిలో సహకరించాలని ఎంపిడిఓ ప్రవీన్‌కుమార్ అన్నారు. సోమవారం జిల్లెడుచౌదరిగూడ మండలంలోని లక్ష్మీదేవిపల్లి గ్రామంలో చేస్తున్న సర్వేను ఆయన పరిశీలించారు. సర్వే చేస్తున్న సిబ్బందితో ఆయన మాట్లాడారు. కుటుంబ సభ్యులవివరాలు సూర్తి స్థాయిలో చేపరించాలని ఆయనతెలిపారు. ఇప్పటి వరకు మండలంలో 1638 ఇళ్ల సర్వే పూర్తి చేసినట్లు ఆయన వివరించారు. గ్రామంలో తమ ఇళ్ల వద్దక ఎవస్తున్న అధికారులకు ప్రజలు సహకరించాలని ఆయన పెర్కోన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిఓ హన్మంత్‌రెడ్డి ఉన్నారు.

## దేవాలయ పునఃపతిష్ట కార్యక్రమానికి ఆహ్వానం

**షాద్‌నగర్, ప్రభాతవార్త, నవంబరు 11 :** షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని ఫరూఖ్‌నగర్‌లో శ్రీవీరాంజనేయస్వామి దేవాలయ పున:నిర్మాణం, విగ్రహ ప్రతిష్ట కార్య క్రమాలకు మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు, సీనియర్ జర్నలిస్టు కేపీ, కస్తూరి రంగనాథ్ తదితరులను కమిటీ నిర్వాహకులు ఆహ్వానించారు. ఎంతో చారిత్రకమైన ఆలయ విగ్రహప్రతిష్ట కార్యక్రమంలో అందరు భాగ స్వామ్యులు కావాలని నిర్వాహకులు పిల్లి శేఖర్, కుడుముల శివ, చెర్కశివ, వీరేశం, లక్ష్మీనర్సింహ, యాదిరెడ్డి, మల్లేష్ తదితరులు ఆలయానికి సంబంధించిన కరపత్రాలను ఇచ్చి ప్రముఖులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు

## రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే

**జిల్లెడు చౌదరిగూడ, నవంబరు 11,(ప్రభాతవార్త):** రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. సోమవారం జిల్లెడు చౌదరిగూడ మండల కేంద్రంలో వరి కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంబించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడు పేద నిరు పేద ప్రజల అభ్యున్నతి కోసం కృషి చేస్తుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు వరి రైతులకు ప్రభుత్వ ధరతో పాటు రూ.500లు బోనస్‌గా ఇస్తున్నట్లు ఆయన వివరించారు. వరి రైతులు దళారులవద్దకు వెల్లకుండ ప్రభుత్వం నిర్వహించిన కొనుగోలు కేంద్రాల వద్ద వరి దాణ్యాన్ని విక్రయించాలని అన్నారు. ప్రభుత్వ నిబందల ప్రకారం తేమ శాతం 17కు పెరగకుండ చూసుకోవాలని తెలిపారు. అలాగె నాణ్యమైన దాన్యంతో గరిష్టధర పొందాలని రైతులకు సూచించారు.

**వరి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి**

జిల్లెడు చౌదరిగూడ మండలంలోని పెద్ద ఎల్కిచర్ల గ్రామంలో వరి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని గాలిగూడ మాజి సర్పంచ్ యాదయ్య తో పాటు పరిసర గ్రామ రైతులు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను కోరారు. పెద్ద ఎల్కిచర్ల పరిధిలో గాలిగూడ, ధర్మ్యతాండ, వీరన్నపేట, హాజిపేట రైతులు ఉన్నట్లు వారు తెలిఎపారు. ఇక్కడ అధికంగా వరిపంట సాగు చేస్తున్నట్లు వివరించారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే వీలైనంత త్వరగ పెద్ద ఎల్కిచర్లలో వరి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని సంబధిత అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ ధామోదర్‌రెడ్డి, ఎడిఎ రాజ రత్నం, ఏఓ రాజేందర్‌రెడ్డి, ఏఈఓ గౌరి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కృష్ణారెడ్డి, చలివేంద్రంపల్లి రాజు. బిసిసెల్‌తాలుక అధ్యక్షుడు చంద్రశేఖర్, మండల అధ్యక్షుడు వడ్డెవెంకట్‌రాములు,కిసాన్‌సెల్ మండల అధ్యక్షుడు వెంకట నర్సింహారెడ్డి, బప్పరాజ్, ఎజాజ్‌ఆలీ, నర్సింహాలు, అక్రమ్, కృష్ణ,రవి, చందు, శ్రీనివాస్, ఆంజనేయులు, సత్యనారాయణరెడ్డి, రజిత, వెంకటయ్య, అన్వర్, మహిమూద్ తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి క్రిస్టియన్ మెథడిస్టు జాతర ప్రారంభం

**ధారూరు, నవంబరు11, ప్రభాతవార్త :** ధారూర్ మెథడిస్టు క్రిస్టియన్ జాతర ఉత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. మండల పరిధిలోని ధారూర్ స్టేషన్, దోర్నాల గ్రామాల మద్య ఉన్న కాగ్నా నది పక్కన జాతర ప్రాంగణంలో ఈనెల 12 నుంచి 17వతేదీ వరకు ఉత్సవాలు కొనసాగుతాయి. ఈ జాతరకు లక్షలాది మంది క్రిస్టియన్ భక్తులు హజరై యేసు ప్రభువు శిలువల వద్ద ప్రార్థనలు నిర్వహిస్తారు. జాతరకు తెలంగాణ రాష్ట్రం నుంచి కాకుండా మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు తరలివస్తారు. జాతరకు వచ్చే భక్తులకు ప్రత్యేక రైళ్లు, బస్సులను ఏర్పాటు చేశారు. రోడ్డు మర్గాన కాలినడకన భక్తులు జాతరకు చేరుకుని మొక్కులు తీర్చుకుంటారు. జాతర ఉత్సవాలకు మత గురువులు హాజరై దైవసందేశాలను బోధించనున్నారు. 102వ మెథడిస్ట్ క్రిస్టియన్ జాతర ఘనంగా నిర్వహించాలని ఉద్దేశంతో జాతర నిర్వాహకులు జాతరలో పలు అభివృద్ధి కార్యక్రమాలు క్రిస్టియన్ కమిటీ మెంబర్లు కే.మార్క్, గాబ్రియల్ పర్యవేక్షణలో చేపట్టారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు ముందు జాగ్రత్తగా పనులు చేపట్టారు.

## మైనార్టీల శ్రేయస్సు కోసం ప్రభుత్వం కృషి

**శామీర్‌పేట, నవంబరు 11, ప్రభాతవార్త :** విద్యార్థులు విద్యారంగంలో మంచి ప్రతిభను చాటాలని, రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీల సంక్షేమం కోసం కృషి చేస్తుందని రాష్ట్ర హాజ్ కమిటీ మెంబర్ ఎండి ముజీబుద్దీన్ పేర్కొన్నారు. సోమవారం మూడుచింతలపల్లి మండలంలోని జగ్గంగూడలోని మైనార్టీస్ గురుకుల పాఠశాలలో జాతీయ మైనార్టీ దినోత్సవ వేడుకలను ఘనంగ నిర్వహించారు. ఈ సందర్భంగ రాష్ట్ర హాజ్ కమిటీ మెంబర్ ఎండి ముజీబుద్దీన్, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి వీణలు మాట్లాడుతూ భారత తొలి విద్యాశాఖ మంత్రి, భారతరత్న మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగ ప్రతిఏటా జాతీయ మైనార్టీ దినోత్సవంను జరుపుకోవటం జరుగుతుందని అన్నారు.

విద్యార్థులు నాణ్యతగల విద్యను పొందటానికి మైనార్టీల కోసం ప్రత్యేకంగ మైనార్టీ సంక్షేమ గురుకుల పాఠశాలలు, కళాశాలలు ప్రభుత్వం ఏర్పాటు చేసిందని అన్నారు. విద్యార్థులు కష్టపడి చదువుకుని విద్యారంగంలో మంచి ప్రతిభను చాటాలని, అన్ని రంగాల్లో రాణించాలని వారు సూచించారు. మేడ్చల్ ఎఎంసి చైర్మన్ బి.నర్సింలుయాదవ్ మాట్లాడుతూ విద్యార్థులు గొప్ప విద్యావేత్తలుగా, ఉన్నత స్థానంలో డాక్టర్లుగా, ఇంజనీర్లుగా,శాస్త్రవేత్తలుగా ఉన్నత అధికారులుగా రాణించాలని సూచించారు.

ఈ కార్యక్రమం మైనార్టీ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ కృష్ణ ఆధ్వర్యంలో కార్యక్రమం ఘనంగ జరిగింది. మైనార్టీ సంక్షేమ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. ఆ తరువాత విద్యార్థులకు బహుమతుల ప్రధానం జరిగింది. ఈ కార్యక్రమంలో వారితో పాటు మాజీ ఎంపిటిసి ఇర్రి రవీందర్‌రెడ్డి, పలువురు మాజీ ప్రజాప్రతినిధులు, మైనార్టీ నాయకులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## రేవంత్ సర్కార్‌ను కూల్చేందుకు బిజెపి, బిఆర్ఎస్ కుట్రలు

జహీరాబాద్‌లో కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న సిపిఐ ఎమ్మెల్యే సాంబశివరావు

**జహీరాబాద్, నవంబరు 11, ప్రభాతవార్త:** రేవంత్‌రెడ్డి సర్కార్‌ను కూల్చేందుకు బిఆర్ఎస్, బిజెపిలు కుట్రలు పన్నుతున్నాయని కొత్తగూడం సిపిఎం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆరోపించారు. సోమవారం సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలో సిపిఐ ఆవిర్భవించి శతాబ్ద కాలం (100 సంవత్సరాలు) పూర్తవుతున్న సందర్భంగా ఏర్పాటు చేసిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మారుస్తారని పదే పదే బిజెపి నాయకులు ఏ ఆధారంగా అంటున్నారని ప్రశ్నించారు. బిజెపి నాయకులు కాంగ్రెస్ గూటిపక్షులా అని నిలదీశారు. బిజెపి, బిఆర్ఎస్‌లు ఏదోరకంగా రేవంత్ సర్కార్‌పై కుట్రపూరితంగా ప్రజల్లో అసత్య ప్రచారాలు చేస్తూ, చేయిస్తూ శాంతిభద్రతలకు ఇబ్బందులు కల్గించేలా చూస్తున్నాయని ఆరోపించారు. ప్రతిపక్ష పార్టీ అయిన బిఆర్ఎస్ ప్రజల తరపున ప్రశ్నించాల్సింది పోయి ప్రభుత్వంపైనే దాడికి దిగుతూ కూల్చే కుట్రలు చేస్తోందని ఆందోళన వ్యక్తంచేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో 400 స్థానాలు సాధిస్తామని బీరాలు పలికిన బిజెపిపార్టీ చావుతప్పి కన్ను లొట్ట పోయినట్లు కొద్ది మెజార్టితో అధికారంలోకి వచ్చిందని ఎద్దేవా చేశారు. ఇటీవల హర్యానా ఎన్నికల్లో సైతం బిజెపి అనుకున్న స్థానాలు సాధించలేదని గుర్తుచేశారు. హర్యానాలో కాంగ్రెస్ స్వయం కృతాపరాధంతోనే ఓటమి చవి చూసిందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ భూములు, చెరువులు, నాలాల పరిరక్షణ ఏర్పాటు హైడ్రాకు వ్యతిరేకం కాదని సాంబశివరావు పేర్కొన్నారు.

## రాష్ట్రస్థాయి క్రీడలకు మడూర్ విద్యార్థుల ఎంపిక

**చిన్నశంకరంపేట,నవంబర్ 11,ప్రభాతవార్త:** రాష్ట్రస్థాయి వాలీబాల్ ఆటకు మడూర్ జడ్పి ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవీందర్‌రెడ్డి తెలిపారు. శనివారం అండర్-14 బాల బాలికల వాలి బాల్ ఆటలను చేగుంటలోని ఆదర్శ పాఠశాలలో పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించగా మడూర్ జడ్పీ ఉన్నత పాఠశాల 9వ తరగతికి చెందిన విద్యార్థులు అంకిత,రమేష్‌లు రాష్ట్ర స్థాయి వాలిబాల్ ఆటకు ఎంపికయ్యారు. 16-18వ తేది వరకు చేగుంటలో నిర్వహించే రాష్ట్ర స్థాయి వాలిబాల్ ఆటలో విద్యార్థులిద్దరు పాల్గొంటారని ఆయన తెలిపారు. పాఠశాలకు పేరు తెచ్చినందుకు విద్యార్థులను, పిఈటి నరేష్‌ను పాఠశాల ఉపాధ్యాయులు, రాములు, ఆంజనేయులు, శివ, లక్ష్మీ, ప్రమోద్, నరేందర్ రాజు, శ్రవణ్, జరీనాలు అభినందించారు.

## లావాదేవీలపై విద్యార్థులకు అవగాహన

**చిన్నశంకరంపేట, నవంబరు 11, ప్రభాతవార్త:** బ్యాంకు లావాదేవీలపై విద్యార్థులు అవగాహన కల్గి ఉండాలని చిన్నశంకరంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ శశిధర్ అన్నారు. సోమవారం కళాశాల ఓకేషనల్ విద్యార్థులకు ఆన్‌జాబ్ ట్రెనింగ్‌లో బాగంగా పట్టణంలోని ఎస్‌బిఐ, ఎపిజివిబి, డిసిసిబి బ్యాంకులో జరిగే లావాదేవీలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. బ్యాంకులకు వచ్చే ఖాతాదారులకు బ్యాంకు అందిస్తున్న సేవలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ ఆన్‌జాబ్ ట్రెనింగ్‌లో విద్యార్థులు బ్యాంకులు చేసే పనులపై పూర్తి అవగాహన వచ

మాట్లాడుతున్న స్వాతిరెడ్డి

## విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

### జిల్లా లీగల్ సెల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి స్వాతిరెడ్డి

**చిన్నకోడూరు, నవంబరు 11,ప్రభాతవార్త :** మండల పరిధిలోని ఇబ్రహీంనగర్ ఆదర్శ పాఠశాలను జిల్లా లీగల్ సెల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి స్వాతిరెడ్డి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడారు. అక్రమాలను అరాచకాల నుంచి కాపాడుకునేందుకు భారత రాజ్యాంగం అనేక హక్కులు, రక్షణ కల్పించిందన్నారు. విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. చట్టాలపై అవగాహన కలిగి ఉంటే ఆత్మవిశ్వాసం పెరుగుతుందని చెప్పారు. మంచి ప్రవర్తనతో విద్యార్థులు జీవిత లక్ష్యాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో కోర్టు సిబ్బంది, ప్రిన్సిపల్ పోచవేని, సతీష్‌కుమార్, వార్డెన్ కిన్నెర నీలిమ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్యం కోసం పనిచేస్తే ఏదైనా సాధ్యమే

క్రీడల్లో రాష్ట్రస్థాయికిఎంపికైన విద్యార్థినిని అభినందిస్తున

**కొండపాక, నవంబరు 11, ప్రభాతవార్త :** ఒక లక్ష్యాన్ని ఎంచుకొని పని చేస్తే దేనినైనా సాధించవచ్చునని బందారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం రామచంద్రం అన్నారు. పాఠశాలకు చెందిన లక్ష్మిప్రసన్న వాలీబాల్ పోటీల్లో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన సందర్భంగా సోమవారం ఉపాధ్యాయులతో కలిసి అమెను అభినందించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఏ రంగంలోనైనా అంకిత భావంతో పని చేస్తే విజయం తప్పకుండా వరిస్తుందన్నారు. చదువుతో పాటు విద్యార్థులందరు ఎదో ఒక క్రీడలో నైపుణ్యం కలిగి ఉండాలని సూచించారు. క్రీడల వల్ల శరీరదారుడ్యంతో పాటు, ఉద్యోగ అవకాశాలు సైతం అందిపుచ్చుకొవచ్చునని తెలపారు. క్రీడల వల్ల మనిషికి మంచి గుర్తింపు వస్తుందన్నారు. ఉపాధ్యాయులు వెంకట్‌రెడ్డి, రమేష్ విద్యార్థి రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు రవాణా ఖర్చుల నిమిత్తం కొంత అర్థిక సహాయం అందించారు. అలాగే మరో ఉపాధ్యాయురాలు భాగ్యలక్ష్మి స్పోర్ట్స్ షూ అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నర్సిరెడ్డి, బాలకనకయ్య, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మహిళల భద్రతకు పోలీసులు సిద్ధం : తొగుట సిఐ

మాట్లాడుతున్న సిఐ లతీఫ్

**కొండపాక, నవంబరు 11, ప్రభాతవార్త :** విద్యార్థి దశ జీవితంలో ఎంతో కీలకమైందని తొగుట సిఐ లతీఫ్ అన్నారు. సోమవారం కొండపాకలోని కెజిబివి స్కూల్‌లో విద్యార్థినిలకు మహిళల రక్షణ చట్టాలు, ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, పోక్సో, షీ టీమ్స్, యాంటి ఉమెన్ ట్రాఫికింగ్, సైబర్ నేరాలు, నూతన చట్టాల గురించి అవగహన కల్పించారు. ఈ సందర్భంగా కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్‌తో కలిసి ఆయన మాట్లాడుతూ జీవితంలో ఏదైనా సాధించాలంటే విద్యార్థి దశ నుండే ప్రణాళికలు తయారు చేసుకోవాలన్నారు. అపరిచితుల ఫోన్‌కాల్స్‌ను, మాటలను నమ్మవద్దన్నారు. విద్యార్థులు సోషల్ మీడియాకు ఎంత దూరంగా ఉంటే అంత భవిష్యత్ బాగుంటుందని తెలిపారు. పోలీసులు మహిళల భద్రత కోసం ఎప్పుడు సిద్ధంగా ఉంటారన్నారు. చదువుపై శ్రద్ధ చూపి ఉన్నత స్థాయికి ఎదగడానికి కృషి చేయాలని సూచించారు. నూతన చట్టాలు మహిళలకు అండగా ఉంటాయన్నారు. మహిళలు ఎవైనా ఇబ్బదులు ఎదుర్కొన్నట్లయితే వెంటనే 100 నెంబర్‌కు పోన్ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ గౌతమి, అధ్యాపకులు, షీ టీం ఎఎస్ఐ శ్రీరాములు, పిసిలు శ్యామల, రామచంద్రా రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మా పొట్ట కొట్టవద్దు అంటూ..
## మున్సిపల్ కార్యాలయం ఎదుట బాధితుల నిరసన

నిరసన వ్యక్తం చేస్తున్న బాదితులు

**హుస్నాబాద్ రూరల్, నవంబరు 11, ప్రభాతవార్త :** గౌరవెళ్లి ప్రాజెక్ట్ డిస్ట్రిబ్యూషన్ కెనాల్ నెం 13ఎల్ నిర్మాణం కోసం భూములు లాక్కొని మా పొట్టలు కొట్టవద్దు అని డిమాండ్ చేస్తూ మున్సిపల్ కార్యాలయం ఎదుట సోమవారం కాలువలో భూములు కోల్పోతున్న నిర్వాసితులు నిరసన వ్యక్తం చేశారు. 13ఎల్ కాల్వ కోసం అధికారులు మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గ్రామ సభ రసభసగా మారింది. సభలో కాల్వను రీ డిజైనింగ్ చేయాలని డిమాండ్ చేసిన బాదితులు గ్రామ సభను బహిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 13 ఎల్ కాల్వ అవసరం లేకున్నా నిర్మిస్తుండడంతో తమ భూములను కోల్పోవాల్సి పరిస్థితి నెలకొందని వాపోయారు. ఈ కాలువను రీడిజైనింగ్ చేయాలని పలుమార్లు అధికారులకు విన్నవించిన తమ గోడు ఎవరూ వినిపించుకోవడం లేరని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో నిర్మించిన కాల్వలోనే తమ భూములు కోల్పోయామని మళ్లీ ఈ కాలువ ద్వారా పూర్తిగా నష్టపోవాల్సి వస్తుందన్నారు. కాలువ నిర్మాణంవల్ల రైతులకు ఎలాంటి ఉపయోగంలేదన్నారు. అధికారులు ఈ కాల్వ నిర్మాణానికి రీడిజైన్‌చేసి ఆదుకోవాలని వేడుకున్నారు.

## నిర్వాసితులకు పరిహారం వెంటనే చెల్లించాలి

### -సిపిఐ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సజ్జని కుమారి

**గజ్వేల్ టౌన్, నవంబరు 11 (ప్రభాతవార్త):**

గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీకి చెందిన నిర్వాసితులకు రావాల్సిన పరిహారం వెంటనే చెల్లించాలని సిపిఐ పార్టీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సజ్జని కుమారి డిమాండ్ చేశారు. సోమవారం సిద్దిపేట జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వాసితుల సమస్యలను కలెక్టర్‌కు తెలియజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మల్లన్నసాగర్ నిర్వాసితులను ఆర్‌అండ్‌ఆర్ కాలనీకి తరలించి నాలుగు సంవత్సరాలు గడుస్తున్నా వారికి అందాల్సిన పరిహారం ఇంకా అందలేదన్నారు. నిర్వాసితులకు అందాల్సిన పరిహారం అందకపోతే కలెక్టరేట్ ముందు ధర్నాకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా అధ్యక్షురాలు గూడెం పద్మ, గజ్వేల్ నియోజకవర్గ కార్యదర్శి శివలింగు కృష్ణ, మల్లన్నసాగర్ భూ నిర్వాసితులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

### సిద్దిపేట జిల్లా కలెక్టర్ మనుచౌదరి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన సమస్యలకు అధిక ప్రాధాన్యతనిస్తూ సత్వరమే పరిష్కార మార్గం చూపాలని జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి మాట్లాడారు. దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో వివిధశాఖల జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**మౌలానా అబుల్ కలాం అజాద్ జయంతి...**

జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో మౌలానా అబుల్ కలాం అజాద్ 136 జయంతి వేడుకలను కలెక్టరేట్ సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి పాల్గొని ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రిగా ఆయన సుదీర్ఘ కాలం పని చేశారని కలెక్టర్ పేర్కొన్నారు. దేశీయ విద్యరంగాన్ని వికసింపచేయడానికి గట్టి చర్యలు అవసరమని చెప్పారని గుర్తు చేశారు. కార్యక్రమంలో డిఆర్వో నాగ రాజమ్మ, వివిధశాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మౌలానా అబుల్ కలాం అజాద్‌కు నివాళులర్పిస్తున్న కలెక్టర్ మను చౌదరి తదితరులు

# కుల గణనపై తప్పుడు ప్రచారం చేస్తే సహించేదిలేదు

### -గజ్వేల్ ఎంసి చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి

**గజ్వేల్, నవంబరు 11 (ప్రభాతవార్త):**

కాంగ్రెస్‌ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కుల గణనపై బిజెపి, బిఆర్ఎస్ పార్టీలు తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజలలో అపోహలు నింపుతున్నారని గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్, కాంగ్రెస్ పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క రాములుగౌడ్, మైనార్టీ సెల్ మాజీ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ సమీర్ పేర్కొన్నారు. సోమవారం గజ్వేల్ పట్టణంలో వారు మాట్లాడుతూ సిఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కులగణన కార్యక్రమం గురించి తప్పుడు ప్రచారం చేయడం సరైంది కాదన్నారు. గతంలో రాహుల్‌గాంధీ సమక్షంలో మాట ఇచ్చినట్లుగానే వారి ఆదేశాల మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బిసి కులగణన చేపట్టడం జరిగిందన్నారు. రాష్ట్రంలో 50 శాతానికి పైగా ఉన్న బిసి, ఎస్సీలకు రాజకీయంగా, విద్యాపరంగా, ఆర్థికపరంగా అన్ని విధాలుగా సమ న్యాయం చేసేవిధంగా ఈ కుల గణన ద్వారానే సామాన్య ప్రజలకు సంబంధించిన ఆర్థిక స్థితిగతులను, వారికి రావాల్సిన, కావాల్సిన పథకాల గురించి బడ్జెట్‌లో కేటాయించాల్సిన ఆర్థిక వనరుల విషయంలో సరైన సమాచారం అందుతుందని, అందువల్లనే ఈ కుల గణన సర్వే చేయడం జరుగుతుందన్నారు. ప్రజలు సర్వేకు సహకరించాలని, కుల గణన విషయంలో సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకునేవిధంగా ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. బిసిలను సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా తొక్కిపెట్టాలని సామాజిక మాధ్యమాల్లో కొంతమంది చేస్తున్న ఈ విష ప్రచారాలను కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ డాక్టర్ వాహిద్‌ఖాన్, సీనియర్ నాయకులు గాడిపల్లి శ్రీనివాస్, ఊడెం శ్రీనివాస్‌రెడ్డి, శివారెడ్డి, మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యుడు గంగిశెట్టి రాజు, మండల మైనార్టీఅధ్యక్షుడు అజ్గర్, కొడకండ్ల బాలు, డప్పు గణేష్, ఆంజనేయులుయాదవ్, శివులు, గుండు లక్ష్మణ్, ముత్రాజ్‌పల్లి జహంగీర్, శ్రావణ్, లింగం తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నరేందర్‌రెడ్డి


మాట్లాడుతున్న కొత్త ప్రభాకర్‌రెడ్డి

## రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన అట్టర్ ప్లాప్ : ఎమ్మెల్యే

**రాయపోల్, నవంబరు 11 ప్రభాతవార్త :** కాంగ్రెస్ పాలనలో ప్రజల నుంచి తీవ్రస్థాయిలో వ్యతిరేకత మొదలైందని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం రాయపోల్ మండలం కొత్తపల్లి గ్రామంలో టీఆర్ఎస్ నాయకులు రాజారాం మధు వాళ్ల అన్నయ్య ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఆనంతరం విలేకురుల సమావేశంలో మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి కౌంట్‌డౌన్ మొదలైందని,కాంగ్రెస్ పాలన అట్టర్‌ప్లాప్ షోఅని అన్నారు.ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వం మీద వ్యతిరేకతో అధికారులపైన దాడులు చేస్తున్నారని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఏ ఒక్క అధికారిపైన దాడిజరగలేదని, సిఎం సొంత నియోజకవర్గంలో అధికారులపై దాడిచేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఇప్పటివరకు రైతు భరోసా ఎగట్టారని, రుణ మాఫీపూర్తి చేయలేదని అలాగే దుబ్బాక నియోజకవర్గంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసారని కాని ఇంత వరకు ధాన్యం కొనుగోలు చేయలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ మండల అధ్యక్షులు వెంకటేశ్వరశర్మ, మాజీ జడ్పీటీసీ లింగాయపల్లి యాదగిరి, నాయకులు రాజిరెడ్డి,ఇప్ప దయాకర్, కల్లూరి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ తిరుపతి నర్సింలు, కరుణాకర్, నాయకులు రాంచంద్రంగౌడ్, కొత్తపల్లి టీఆర్ఎస్ గ్రామ అధ్యక్షులు బాల్‌నర్స్, నాయకులు సత్యం, యాదగిరిగౌడ్, ఉప్పరి స్వామి, రాజాగౌడ్, రాజానర్స్, నవీన్, బార్గవ్, మురళి పాల్గొన్నారు.

### నేటి నుంచి చాతుర్మాస్య శ్రీరామ తారక మహా మంత్ర
## శతకోటి జపయజ్ఞ పరిసమాప్తి ఉత్సవాలు

**నర్సాపూర్, నవంబరు 11, ప్రభాతవార్త:** ఈ నెల 12వ తేదీ నుండి నర్సాపూర్ మండలం రుస్తుంపేట గ్రామంలోగల ఆత్మానందాశ్రమంలో చాతుర్మాస్య శ్రీరామతారక మహామంత్ర శతకోటి జపయజ్ఞ పరిసమాప్తి ఉత్సవాలు నాలుగు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు ఆత్మానందాశ్రమ పీఠాధిపతి రాజయోగి వెంకట స్వామిజీ తెలిపారు. ఉత్సవాలకు శ్రీవిరూపాక్షవిద్యారణ మహాసంస్థానాధీశ్వరులు జగద్గురు శంకరాచార్యులు, హంపి పీఠాధిపతి శ్రీవిద్యారణ్యభారతీ మహాస్వామిజీ. తోగుట శ్రీగురుమదనానంద సరస్వతి పీఠాధిపతి శ్రీమాదవానంద సరస్వతిస్వామి హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ చాతుర్మాస్య ఉత్సవాలు ఈ నెల 12న సుప్రభాతసేవ, గణపతిపూజ, గురుపూజ,గోపూజ, శ్రీలక్ష్మీనర్సింహ స్వామికి అభిషేకం, పుణ్యావాచనమ్, అఖండ దీపస్థాపన, దేవాతాహ్వానం, అగ్ని ప్రతిష్ట, శ్రీరామామూల మంత్ర మహాయాగం, రాజోపచార పూజ, మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వితరణ, 13న సుప్రభాత సేవ, గణపతి పూజ, గురుపూజ,గోపూజ, శ్రీరామామూల మంత్ర మహాయాగం, రాజోపచార పూజ, తీర్థ ప్రసాద వితరణ, 14న సుప్రభాత సేవ, గణపతి పూజ, గురుపూజ, గోపూజ, శ్రీరామామూల మంత్ర మహాయాగం,స్థాపిత దేవతాహవనం, శ్రీసీతా రామ కళ్యాణం, బలిప్రధానం, పూర్ణాహుతి, మహాదాశీర్వచనమ్, రుత్విక సన్మానం, తీర్థ ప్రసాద వితరణ, ఈ నెల 15 న సుప్రభాతసేవ, లక్ష పుష్పార్చన, తులసీ కళ్యాణం, సాయంత్రం లక్షదీపోత్సవం వంటి కార్యక్రమాలుంటాయని తెలిపారు. అంతేగాక రాత్రి సమయాల్లో భజన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సమగ్ర కుటుంబ సర్వేను పరిశీలిస్తున్న నర్సాపూర్ ఆర్డీవో మహిపాల్‌రెడ్డి

## సమగ్ర సర్వేను ఆర్డీవో ఆకస్మిక తనిఖీ

**కొల్చారం, నవంబరు 11 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఆర్థిక, విద్య, సామాజిక, రాజకీయ, కుల గణన ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని నర్సాపూర్ ఆర్డీవో మహిపాల్ రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రమైన కొల్చారం గ్రామంలో చింతల బస్తీలో జరుగుతున్న సమగ్ర కుటుంబ సర్వేను నర్సాపూర్ ఆర్డీవో ఆర్డీవో మహిపాల్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేసి పరిశీలించారు. అనంతరం ఇంటింటి సర్వే చేస్తున్న ఎన్యుమరేటర్లకు, అధికారులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆర్డీవో మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ సమగ్ర కుటుంబ సర్వేలో ఎక్కడా తప్పులు దొర్లకుండా సరైన పద్ధతిలో సర్వేలు నిర్వహించాలని ఆయన ఎన్యుమరేటర్లకు, సిబ్బందికి సూచించారు. ఇంటి వద్దకు సర్వేకు వచ్చిన ఎన్యుమరేటర్లకు పూర్తి సమాచారం అందివ్వాలన్నారు. సమగ్ర కుటుంబ సర్వేకు వచ్చిన అధికారులకు సరైన పత్రాలతో ప్రజలు వారి వారి ఇంటి వద్ద ఉండి సహకరించాలని ఆర్డివో మహిపాల్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ ప్రభాకర్, కొల్చారం గ్రామ కార్యదర్శి అంజయ్య, ఎన్యుమరేటర్లు, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

## ఘనంగా అబ్దుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలు

**సంగారెడ్డి బ్యూరో నవంబరు 11, ప్రభాతవార్త:** జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ సమీకృత జిల్లా కార్యాలయాల సమావేశ మందిరంలో భారతరత్న, కేంద్ర తొలి విద్యాశాఖ మంత్రి అబ్దుల్ కలాం ఆజాద్ జయంతిని వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా రెవిన్యూ అధికారి పద్మజ రాణి ,ఇతర జిల్లా అధికారులు మోలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భముగా జిల్లా రెవిన్యూ అధికారి పద్మజ రాణి మాట్లాడుతూ స్వాతంత్రం అనంతరం 11 ఏళ్లపాటు విద్యాశాఖ మంత్రిగా పనిచేసి దేశంలో విద్యా వ్యవస్థను పునాదులు వేసిన మహనీయుడు మోలానా అబుల్ కలాం ఆజాద్ అని పేర్కొన్నారు. ఆయన నాయకత్వంలో విద్యా రంగంలో అనేక సంస్కరణలు తీసుకురావడం జరిగింది. ఆయన రచయితగా, కవిగా, తత్వవేత్తగా, విద్యావేత్తగా, రాజకీయ వేత్తగా కూడా అపార సేవలు అందించారు. మైనార్టీ వర్గాల అభ్యున్నతికి కూడా ఆయన చేసిన కృషిని గుర్తుచేశారు . ఆయన సేవలకు గుర్తింపుగా నవంబర్ 11వ తేదీని జాతీయ విద్యా దినోత్సవంగా ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్నదని జిల్లా రెవిన్యూ అధికారి పద్మజ రాణి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ దేవజా , డీఈఓ వెంకటేశ్వర్లు , పి డి.మెహ్మా గీత, యూవజన సంక్షేమ శాఖ ఖాసీం బేగ్, వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు, తదితరులు పాల్గొన్నారు

# ఇండస్ట్రియల్ పార్కు పేరుతో భూములు లాక్కోవద్దు

**అక్కన్నపేట, నవంబరు 11, ప్రభాతవార్త**

చౌటపల్లి గ్రామంలో వ్యవసాయ ఆధారిత భూముల్లో ఇండస్ట్రియల్ పార్కు పేరుతో ప్రభుత్వం తమ భూములు లాక్కోవాలని చూస్తోందని, ఈ ప్రయత్నాన్ని వెంటనే విరమించుకోవాలని బాదితులు సోమవారం సిద్దిపేట కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాతల కాలం నుండి వారసత్వంగా వస్తున్న ఈ భూముల్లోనే వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నామని, ఆ భూముని మాకు కాకుండా లాక్కోవాలని చూడడం దారుణమన్నారు. జనవాసాల మధ్య ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుచేయడం ఎన్నో ఇబ్బందులు వచ్చే అవకాశాలు ఉన్నాయని, జీవనాదారమైన భూములను ప్రభుత్వం లాక్కోవడం వల్ల తాము రోడ్డున పడే పరిస్థితి ఉందన్నారు. ఇండస్ట్రియల్ పార్క్ నిర్మాణం ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని లేకుంటే తమకు చావే శరణ్యమని స్పష్టం చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో చౌటపల్లి గ్రామ అఖిలపక్ష నాయకులు, రైతులు జంపయ్య, పెద్ద వెంకటయ్య, వెంగారావు, కుమారస్వామి, రాజమౌళి, నాగభూషణం, మహేష్ ఉన్నారు.


సిద్దిపేట జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరికి వినతి పత్రం అందిస్తున్న బాదితులు

విద్యార్థులను అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు

## రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

**గజ్వేల్, నవంబరు 11 (ప్రభాతవార్త):** ఉమ్మడి మెదక్ జిల్లా వాలీబాల్ అండర్-14 బాలికల విభాగంలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఆర్‌అండ్‌ఆర్ కాలనీ గజ్వేల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న బి. అక్షిత, ఎస్.పవిత్ర, అండర్-17 వాలీబాల్ బాల బాలికల విభాగంలో స్వామినాయక్, కావ్య, ఇందు, దీక్షేశ్వరిలు ఎంపిక చేయబడ్డారని ప్రధానోపాధ్యాయుడు కరీమొద్దీన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి మెదక్ జిల్లా క్రీడాకారుల ఎంపికలో భాగంగా చేగుంటలో నిర్వహించిన పోటీలలో మెరుగైన ప్రతిభను ప్రదర్శించి ఎంపిక అయ్యారని తెలిపారు. ఉమ్మడి జిల్లా స్థాయిలో వాలీబాల్ పోటీల్లో ఎంపికైన విద్యార్థులను అభినందించారు. వారితో పాటు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ సిహెచ్.ప్రశాంత్, పాఠశాల ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ అధ్యక్షురాలు నీరుడి ఆండాలు విద్యార్థులను అభినందించారు. కాగా రాష్ట్ర స్థాయి పోటీలు మెదక్ జిల్లా చేగుంటలో ఈనెల 17వ తేదీనుండి జరుగనున్నట్లు తెలిపారు.

## గ్రామాల అభివృద్ధికి హరీష్‌రావు కృషి : మాజీ సర్పంచ్

**చిన్నకోడూరు, నవంబరు 11, ప్రభాతవార్త :** గ్రామాల అభివృద్ధికి మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు కృషి చేస్తున్నారని విఠలాపూర్ మాజీ సర్పంచ్ మద్దికుంట నవీన్ అన్నారు. మండల పరిధిలోని విఠలాపూర్ నుంచి గంగాపూర్ వరకు డబుల్ రోడ్డు నిర్మాణ పనులను ఆయన సోమవారం ప్రారంభించి మాట్లాడారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు ఆదేశాల మేరకు రోడ్డు పనులు ప్రారంభించడం జరిగిందన్నారు. డబుల్ రోడ్డు నిర్మాణంతో ప్రజలకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు సింగిరెడ్డి సాగర్‌రెడ్డి, మధురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రియాంక కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

### -కెవిపిఎస్ జిల్లా అధ్యక్షుడు బక్కెల్లి బాలకిషన్

**మర్కుక్, నవంబరు 11 (ప్రభాతవార్త):** దళిత వివాహిత ప్రియాంక కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కెవిపిఎస్ జిల్లా అధ్యక్షుడు బక్కెల్లి బాలకిషన్, జిల్లా ఉపాధ్యక్షుడు మరాఠి కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. మండల పరిధిలోని ఎర్రవల్లి గ్రామానికి చెందిన వివాహిత ప్రియాంక గ్రామానికి చెందిన కుంట భాస్కర్ అనే వ్యక్తి వేధింపులకు గురిచేయడంతో ఆత్మహత్య చేసుకున్న సంగతి అందరికి తెలిసిందే. సోమవారం మృతురాలి కుటుంబానికి న్యాయం చేసి భాస్కర్‌పై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని సిద్దిపేటలోని కలెక్టర్ కార్యాలయంలో ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మృతురాలు ప్రియాంకకు ఇద్దరు కూతుర్లు ఉండగా ఒకరు రెండు సంవత్సరాలు, మరొకరు ఐదు నెలల పాప ఉందని, ఈ కుటుంబానికి ప్రభుత్వం మూడు ఎకరాల భూమిని కేటాయిస్తూ అన్ని విధాలుగా ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్ మనుచౌదరి సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు.

## సర్వేలో తప్పులు లేకుండా నమోదు చేయాలి

దౌలాపూర్‌లో ఇంటింటి సర్వేను పరిశీలిస్తున్న ఎంపిఓ

**జగదేవ్‌పూర్, నవంబరు 11 (ప్రభాతవార్త):** సమగ్ర ఇంటింటి సర్వేలో ఎలాంటి తప్పులు లేకుండా అధికారులు నమోదు చేయాలని పంచాయతీ అధికారి ఎండి.ఖాజామొహినొద్దీన్ అన్నారు. సోమవారం దౌలాపూర్ గ్రామంలో నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక, ఆర్థిక, విద్య ఉపాధి, రాజకీయ, కులంకు సంబంధించిన వివరాలను కుటుంబ యజమానులు చెప్పిన విధంగా నమోదు చేయాలని, ప్రతి ప్రశ్నను పూర్తి స్థాయిలో పూరించాలని అన్నారు. సర్వేకు గ్రామాల్లోని ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సతీష్, సర్వే అధికారులు పాల్గొన్నారు.

## సమగ్ర సర్వేను పరిశీలించిన డిఆర్‌డివో

సమగ్ర కుటుంబ సర్వేను పరిశీలిస్తున్న డిఆర్‌డివో

**నర్సాపూర్, నవంబరు 11, ప్రభాతవార్త:** మండలంలో నిర్వహిస్తున్న ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వేను సోమవారం డిఆర్‌డివో, మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్‌రావు పరిశీలించారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని రెడ్డిపల్లి, చిన్నచింతకుంట గ్రామాలను సందర్శించి ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వేను ఎన్యుమరేటర్‌లు సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. అంతేగాకుండా ఈ సర్వేలోఎటువంటి తప్పులు ఉండకుండా చూడాలన్నారు.ప్రతి ఇంటికి వెళ్ల

Main-IV(MDK)-NOV 11:Main-IV(MDK)-NOV 11.qxd 11/11/2024 7:15 AM Page 1



## నిజాంపేటలో కొనసాగుతున్న సర్వే

**నిజాంపేట, నవంబరు 11, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన నిజాంపేటలో సమగ్ర కుటుంబ సభ్యుల సర్వే చురుకుగా కొనసాగుతోంది. ఎన్యూమరేటర్లు గ్రామంలో తమకు కేటాయించిన ఇండ్లకు చేరుకుని సర్వే నిర్వహిస్తున్నారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలను నమోదు చేసుకుంటున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాధాకిషన్, మాజీ ఎంపిటిసి సభ్యులు లింగారెడ్డి, మాజీ సర్పంచ్ జగన్ చారి, నాయకులు రామచంద్రరావు, ఎన్యూమరేటర్లు పాల్గొన్నారు.

## జిల్లా కోశాధికారిగా పోలీస్ సంతోష్‌కుమార్

**పుల్‌కల్, నవంబరు 11, ప్రభాతవార్త:** వీరశైవ లింగాయత్ సంగారెడ్డి జిల్లా కోశాధికారిగా పోలీస్ సంతోష్‌కుమార్‌ను ఎన్నుకున్నారు. సోమవారం జహీరాబాద్ పట్టణంలో నిర్వహించిన సమావేశంలో మండల పరిధిలోని పెద్దారెడ్డిపేట గ్రామానికి చెందిన పోలీస్ సంతోష్‌కుమార్‌ను కోశాధికారిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరశైవ లింగాయత్ సమాజ్ అభ్యున్నతికి తన వంతు కృషి సల్పుతానని సంతోష్‌కుమార్ ఈ సందర్భంగా హామీనిచ్చారు. సంతోష్‌కుమార్ గతంలో జిల్లా ఉపాధ్యక్షులుగా, యువజన విభాగం జిల్లా అధ్యక్షులుగా సమాజానికి సేవలు అందించారు. కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు సులుగంటి సిద్ధేశ్వర్, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఇప్పపల్లి నర్సింలు, కొంక రాజేశ్వర్, కార్యనిర్వాహక అధ్యక్షులు పట్లోళ్ల చంద్రశేఖర్‌లు పాల్గొన్నారు. రెండు సంవత్సరాలు పాటు సంఘంలో బాధ్యతలు నిర్వహిస్తారని ఎన్నికల పరిశీలకులు జిల్లా కమిటి సభ్యులు, న్యాయవాది సిహెచ్ బస్వరాజ్, శివచంద్రకుమార పాటిల్‌లు పేర్కొన్నారు.

## స్థానిక సంస్థ ఎన్నికల్లో ఎంఐఎం సత్తా

కార్యకర్తలకు సూచనలు చేస్తున్న ఎంఐఎం అధ్యక్షులు మోహీద్ పటేల్

**నారాయణఖేడ్ టౌన్, నవంబరు 11, ప్రభాతవార్త:** రానున్న స్థానిక సంస్థ ఎన్నికల్లో (సర్పంచ్, ఎంపిటిసి, జడ్పిటిసి, మున్సిపాలిటీ) ఎంఐఎం పార్టీ పోటీచేసి తన సత్తా చాటుకుంటుందని ఎంఐఐ అధ్యక్షులు మోహీద్ పటేల్ అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో పార్టీ కార్యకర్తలతో సమావేశం అయిన మోహీద్ పటేల్ కార్యకర్తలకు పలుసూచనలు చేశారు. ఈ సందర్భంగా మోహీద్ పటేల్ మాట్లాడుతూ మొదటి సారిగా ఎంఐఎం తరపున పార్టీ అధినేత, ఎంపి అసదుద్దీన్ ఒవైసి సూచనల మేరకు నారాయణఖేడ్‌లో పోటీ చేస్తున్నట్లు, పార్టీ అభ్యున్నతికి ప్రతి ఒక్కరు తమ వంతు కృషి చేయాలని కార్యకర్తలకు సూచించారు. నారాయణఖేడ్ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఎంఐఎం ప్రజల మధ్యలోనే తాము ఉంటూ వస్తున్నామన్నారు. ప్రజల మద్దతు పొందేందుకు కులమతాలకు అతీతంగా ప్రజాసేవ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎం నాయకులు షేక్ అంజాద్, చాంద్‌పాషా, అబ్దుల్ జబ్బార్, యువ నాయకులు సల్మాన్ పటేల్, ఇమ్రాన్ పటేల్, అబ్దుల్ ఆహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## నూజివీడు సీడ్స్ క్షేత్ర సందర్శన

**పాపన్నపేట, నవంబరు 11, ప్రభాతవార్త:** మండల పరిధిలోని అబ్లాపూర్‌లో సోమవారం నూజివీడు విత్తన ఆధ్వర్యంలో క్షేత్ర సందర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సంధ్య ఎన్‌పి-9359-9 వరి విత్తనంపై రైతులకు అవగాహన కల్పించారు. సంధ్య ఎన్‌పి-9359-9 వరి విత్తనంతో పంటను సాగు చేస్తే తక్కువ ఖర్చుతో అధిక లాభాలు పొందవచ్చని నేషనల్ సేల్స్ మేనేజర్ ప్రవీణ్‌రెడ్డి రైతులకు సూచించారు. వరిని ఆశించే అగ్గి తెగులును శక్తివంతంగా ఎదుర్కొంటుందన్నారు. వ్యవసాయంలో అధిక లాభాలు పొందేందుకు రైతులు పాటించాల్సిన పలు మెళకువలు రైతులకు వివరించారు. కార్యక్రమంలో 12 మెట్ల కిన్నెర కళాకారులు, పద్మశ్రీ అవార్డు గ్రహీత దర్శనం మొగిలయ్య తన పాటలు, సంగీతంతో రైతులను అలరించారు. నేషనల్ సేల్స్ ఎనేబుల్మెంట్ మేనేజర్ తూము సామ్రాట్, తెలంగాణ రీజినల్ మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి, మార్కెటింగ్ ప్రతినిధులు రాజు, బిఆర్ఎస్ నాయకులు ఏడుకొండలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## సదర్ ఉత్సవాల్లో పాల్గొన్న చైర్మన్

**జహీరాబాద్, నవంబరు 11, ప్రభాతవార్త:** పట్టణంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సదర్ ఉత్సవాల వేడుకల్లో సెట్విన్ చైర్మన్ ఎన్ గిరిధర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సదర్ కార్యక్రమానికి చేరుకున్న గిరిధర్‌రెడ్డికి నిర్వాహకులు ఘనంగా స్వాగతం పలికారు. యాదవ సోదరులకు సదర్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ మంకాల్ సుభాష్, యూత్ కాంగ్రెస్ నాయకులు ఎన్ఎస్‌యుఐ నాయకులు, యాదవ సంఘం నాయకులు పాల్గొన్నారు.

## ఎబివిపి ఆధ్వర్యంలో విద్యార్థుల ధర్నా

బస్సులకోసం ధర్నా చేస్తున్న విద్యార్థులు

**జోగిపేట, నవంబరు 11, ప్రభాతవార్త:** బస్సులను సమయానుకూలంగా నడపకపోవటంతోపాటు, ఇష్టానుసారంగా బస్సులను వేస్తుండటంతో తాము తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నామంటూ ఎబివిపి ఆధ్వర్యంలో సోమవారం జోగిపేట బస్టాండు వద్ద విద్యార్థులు ధర్నా నిర్వహించారు. నారాయణఖేడ్ నుంచి జగిత్యాల మీదుగా వచ్చే నారాయణఖేడ్ బస్సును ఉదయం విద్యార్థులకు అనుకూలమైన సమయంలో నడపటంలేదని, అలాగే సాయంత్రం కూడా బస్సు సమయానికి అందుబాటులో ఉండటం లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో నారాయణఖేడ్ డిపోలో పలుమార్లు వినతిపత్రాలు అందచేసినా మార్పు రావటంలేదని పేర్కొన్నారు. విద్యార్థుల సమస్యలను దృష్టిలో ఉంచుకొని ఇప్పటికైనా బస్సులను విద్యార్థులకు అనుకూలమైన సమయంలో నడపాలని కోరారు.

## జాతీయ విద్యాదినోత్సవ వేడుకలు

**జహీరాబాద్, నవంబరు 11, ప్రభాతవార్త:** పట్టణంలోని ఆచార్య డిగ్రీ కళాశాలలో సోమవారం జాతీయ విద్యాదినోత్సవాన్ని (మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ జన్మదినం)ను ఎన్ఎస్ఎస్ యూనిట్లు 1,2,3,4,5ల ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చింతల హరికుమార్ మాట్లాడుతూ ఆజాద్ ఆశించిన దేశీయ విద్యారంగాన్ని ప్రతిష్ఠను నిలపవలసిన అవసరం ఉందన్నారు. దేశంలో విద్యాభివృద్ధికి అనేక సంస్కరణలు ప్రారంభించారని ఆజాద్‌ను కొనియాడారు. ప్రతిష్ఠాత్మకమైన ఇండియన్ ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ టెక్నాలజీతో పాటు ఐఐటిలు పలు ఐఐఎంలు, విశ్వవిద్యాలయాలు ఆజాద్ హయాంలోనే పురుడు పోసుకున్నాయని గుర్తు చేశారు. నాణ్యమైన విద్యకు పునాదిరాళ్లు వేసిన వ్యక్తి అని కీర్తించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు జి.శ్రీనివాస్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు కె.నందు గౌడ్, దత్తు నికిత, ఈర్ష నుల్తానా, వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

# జూకల్ సోషల్ వెల్ఫేర్‌లో క్రీడా పోటీలు

**-క్రీడాజ్యోతిని వెలిగించి క్రీడలను ప్రారంభించిన ఎమ్మెల్యే**

జూకల్‌లో క్రీడాకారులతో కలిసి క్రీడాజ్యోతిని వెలిగిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

**నారాయణఖేడ్ టౌన్, నవంబరు 11, ప్రభాతవార్త:** మండల పరిధిలోని జూకల్ గ్రామ శివారులోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్‌లో సోమవారం 6, 10 జోనల్ అండర్ 14, 17 బాలుర క్రీడా పోటీలను ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి క్రీడాజ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడలకు ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రాష్ట్ర చరిత్రలో 364 కోట్ల రూపాయలను క్రీడాశాఖకు కేటాయించినట్లు గుర్తు చేశారు. జిల్లాకు స్పోర్ట్స్ యూనివర్సిటీ, నియోజకవర్గంలో ఇండోర్ స్టేడియం నెలకొల్పేందుకు ప్రణాళికలు సిద్ధం అవుతున్నాయన్నారు. గ్రామీణ స్థాయి నుంచి క్రీడాకారులను వెలుగులోకి తీసుకొచ్చేందుకు రాష్ట్ర వ్యాప్తంగా సిఎం కప్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం క్రీడలను పట్టించుకున్న పాపాన పోలేదని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ నుంచి ఒలింపిక్స్ క్రీడలకు ఎంపిక కావాలంటే గ్రామీణ స్థాయిలో క్రీడాకారుల ప్రతిభను గుర్తించాల్సిన అవసరం ఉంటుందన్నారు. సిఎం కప్ పోటీల్లో గ్రామ, మండల స్థాయిలో నైపుణ్యం పొందిన క్రీడాకారులను ఎంపిక చేసి, రాష్ట్ర, అంతర్‌రాష్ట్ర స్థాయిల్లో ఒలింపిక్స్‌కు వెళ్లే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడాకారులను ప్రోత్సహిస్తోందన్నారు. క్రీడల్లో రాణిస్తే సర్టిఫికెట్లతో పాటు ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు ప్రత్యేక ప్రోత్సాహకాలను ప్రభుత్వం అందచేస్తుందన్నారు. విద్యార్థులు, యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ క్రమశిక్షణతో క్రీడలపై దృష్టిని సారించాలని సూచించారు. జూకల్‌కు చేరుకున్న క్రీడాకారులకు ఎలాంటి అసౌకర్యం కల్గకుండా తగు ఏర్పాట్లుచేయాలని ఎమ్మెల్యే సూచించారు. క్రీడా స్ఫూర్తితో ఆటలు ఆడుకోవాలని క్రీడాకారులకు ఎమ్మెల్యే సూచిస్తూ ఆల్ ద బెస్ట్ చెప్పారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌స్వరూప్ శెట్కార్, వైస్ చైర్మన్ దారం శంకర్ సేట్, రమేష్ చౌహాన్, శంకర్ ముదిరాజ్, పల్లవి పరశురాం, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## క్రీడల్లోనూ విద్యార్థులు రాణించాలి!

జోనల్‌స్పోర్ట్స్ మీట్‌ను ప్రారంభిస్తున్న ఆర్డీవో పాండు

**జోగిపేట, నవంబరు 11, ప్రభాతవార్త:** విద్యార్థులు కేవలం చదువుకే పరిమితం కాకుండా క్రీడల్లోనూ రాణించాలని ఆందోలు ఆర్డీవో పాండు సూచించారు. సోమవారం ఆందోలులోని రెసిడెన్షియల్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన జోనల్ స్పోర్ట్స్ మీట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ క్రీడలవల్ల పిల్లలకు శారీరక దారుఢ్యం పెరగటంతోపాటు మానసికోల్లాసం లభిస్తుందని పేర్కొన్నారు. గురుకుల పాఠశాలలోనే చదివిన మాలోత్ పూర్ణ ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించిందని, అలాంటి వారిని స్ఫూర్తిగాతీసుకుని పట్టుదలతో చదువుల్లోనైనా, క్రీడల్లోనైనా కృషి చేయాలన్నారు. అలాంటపుడే జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని సూచించారు. క్రీడలను స్పోర్ట్స్ స్పిరిట్‌తో ఆడాలని, గెలిచిన వారు సంబరపడటమో, ఓడినవారు కృంగిపోవటం లాంటి ఎమోషన్స్‌కు గురికావొద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ విద్యాసంస్థల రాష్ట్ర అధికారి భీమయ్య, తహశీల్దారు విష్ణుసాగర్, సూపరిండెంట్ ఎం.గంగాధర్‌లు పాల్గొన్నారు.

## మంత్రి సహకారంతో జోగిపేట మార్కెట్ అభివృద్ధి



మార్కెట్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఛైర్మెన్ మక్త జగన్మోహన్‌రెడ్డి

**జోగిపేట, నవంబరు 11, ప్రభాతవార్త:** రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సహకారంతో జోగిపేట వ్యవసాయ మార్కెట్‌ను అభివృద్ధి చేసుకుందామని నూతన మార్కెట్ కమిటీ ఛైర్మెన్ మక్త జగన్మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం జోగిపేట వ్యయసాయ మార్కెట్ నూతన పాలకవర్గం ఆధ్వర్యంలో మార్కెట్ కమిటీ కార్యాలయంలో సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఇందులో మొట్టమొదటగా మంత్రికి ధన్యవాద తీర్మానాన్ని అమోదించిన అనంతరం మార్కెట్ అభివృద్ధికి చేపట్టవలసిన పలు పనులపై తీర్మానాలు చేశారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ మార్కెట్ పరిధిలోని ఐదు మండలాల రైతులు తాము పండించిన పత్తిని 12 శాతం లోపు తేమ ఉండేలా తీసుకుని వచ్చి సిసిఐ కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకొంటే, గిట్టుబాటు ధర లభిస్తుందని, మధ్య దళారులను ఆశ్రయిస్తే నష్టపోతారని ఆయన సూచించారు.

## చైన్ స్నాచింగ్ దొంగలకు ఏడేళ్ల జైలు

**రామచంద్రాపురం, నవంబరు 11, ప్రభాతవార్త:** చైన్ స్నాచింగ్‌కు పాల్పడుతున్న యువకులను పట్టుకోబోయిన కానిస్టేబుల్‌పై హత్యాయత్నం చేసిన ఇద్దరు దొంగలకు 7 ఏండ్ల కఠిన కారాగారశిక్ష విధిస్తూ సోమవారం న్యాయమూర్తి తీర్పుచెప్పినట్లు రామచంద్రాపురం ఎస్ఐ జగన్నాథ్ తెలిపారు. ఇందుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. 2022 జులైలో భెల్ హెచ్ఐజి కాలనీలో ఓ మహిళ మెడలో నుంచి గోల్డ్ చైన్‌ను కర్ణాటక రాష్ట్రం హుమ్నాబాద్‌కు చెందిన ఇసాన్ నిరంజన్, రాహుల్‌లు స్నాచింగ్ చేసి బైక్‌పై పారిపోయారన్నారు. ఇది గమనించిన హెడ్‌కానిస్టేబుల్ యాదయ్య, కానిస్టేబుల్ రవిలు వారిని పట్టుకునేందుకు ప్రయత్నిస్తుండగా, ఇద్దరు యాదయ్యపై కత్తులతో దాడిచేశారన్నారు. అయినా బెదరకుండా యాదయ్య ఇద్దరు దొంగలను పట్టుకుని ఊచలు లెక్కింపచేశారు. రంగారెడ్డి జిల్లా ఎల్‌బినగర్ న్యాయస్థానంలో ఇద్దరు దొంగలకు 7 ఏళ్ల జైలుశిక్షతో పాటు వేయి రూపాయల జరిమానా విధించినట్లు ఎస్ఐ జగన్నాథ్ వివరించారు.

## ఇండ్ల స్థలాలకు సిపిఐ పోరాటం

సిపిఐ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సాంబశివరావు

**జహీరాబాద్, నవంబరు 11, ప్రభాతవార్త:** సిపిఐ ఆధ్వర్యంలోనే నిరుపేదలకు ఇండ్ల స్థలాల కొరకు పోరాటం చేస్తుందని కొత్తగూడెం సిపిఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. సోమవారం పట్టణంలోని ఏషియన్ గార్డెన్‌లో నిర్వహించిన సిపిఐ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. గత కొన్ని సంవత్సరాలుగా ఇండ్ల స్థలాల కొరకు అధికారులకు వినతిపత్రాలు అందిస్తున్నా పట్టించుకోవడం లేదని విచారం వ్యక్తం చేశారు. ఈ మాసంలో ప్రభుత్వ స్థలాలు ఎక్కడ ఉంటే అక్కడ ఇండ్ల స్థలాల కొరకు ఎర్ర జెండాలు పాతి గుడిసెలు వేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఐటి నర్సింహా, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు వి.ప్రకాష్‌రావు, జిల్లా కార్యదర్శి సయ్యద్ జలాలుద్దిన్, డివిజన్ కార్యదర్శి కె.నర్సింలు, అజార్, ఆనంద్, చిరంజీవి, అశోక్, రూబీనా, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణిలో 39 ఫిర్యాదులు

**సంగారెడ్డి టౌన్, నవంబరు 11, ప్రభాతవార్త:** జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 39 ఫిర్యాదులు వచ్చినట్లు అదనపు కలెక్టర్ మాధురి తెలిపారు. జిల్లాలోని ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుని ప్రజల్లో కార్యక్రమంపై విశ్వాసం పెంచుతామన్నారు. అందిన ఫిర్యాదులను ఆయా శాఖలకు కేటాయించి పరిష్కరిస్తున్నామన్నారు. వచ్చిన అర్జీలు పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికి అప్పుడు పరిశీలన చేసి సమస్యను పరిష్కరించేందుకు అధికారులు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో జడ్పి సిఈఓ జానకిరెడ్డి, డిపిఓ సాయిబాబా, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకోసం వైకుంఠరథం



వైకుంఠరథ వాహనాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మెన్ పల్లె జితేందర్‌గౌడ్

**రామాయంపేట మున్సిపాలిటీ, నవంబరు 11, ప్రభాతవార్త:** రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలందరి అవసరాల కోసం మున్సిపల్ పాలకవర్గం ఆధ్వర్యంలో ఉచిత వైకుంఠరథాన్ని సోమవారం స్థానిక మున్సిపల్ చైర్మెన్ పల్లె జితేందర్‌గౌడ్, పాలకవర్గంతో కలసి ప్రారంభించారు. జితేందర్‌గౌడ్ మాట్లాడుతూ రామాయంపేట పట్టణప్రజలకు ఉచితంగా వాడుకోవడానికి మున్సిపల్ పాలకవర్గం ఆధ్వర్యంలో వైకుంఠరథం అందుబాటులోకి తెచ్చామని తెలిపారు. అందరూ ఈ ఉచిత సేవలు వినియోగించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మెన్ పుట్టి విజయలక్ష్మి యాదగిరి, మున్సిపల్ కమిషనర్ దేవేందర్, మున్సిపల్ మేనేజర్ శ్రీనివాస్, బొర్ర అనిల్‌కుమార్, సుందర్‌సింగ్, గజవాడ నాగరాజు, చంద్రపు శోభాకొండల్‌రెడ్డి, యాదగిరి, మల్యాల కవితా కిషన్, దేవుని జయరాజు, చింతల రాధాభవాని, చిలుక గంగాధర్, కోఆప్షన్ సభ్యులు ఐరేని పృథీరాజ్‌గౌడ్, ఎస్.కె.అహ్మద్‌తోపాటు మున్సిపల్ అధికారులు,సిబ్బంది పాలొగన్నారు.

# పల్వట్ల చోరీ కేసులో దొంగ అరెస్ట్, పరారీలో ఇద్దరు

పల్వట్ల చోరీ కేసును చేధించి వివరాలు వెల్లడిస్తున్న జోగిపేట సిఐ అనిల్‌కుమార్

**జోగిపేట, నవంబరు 11, ప్రభాతవార్త:** వట్‌పల్లి మండలం పల్వట్లలో సునందమ్మ ఇంట్లో గత నెల 21న జరిగిన దోపిడి కేసులో ఒకరిని అరెస్ట్ చేయగా మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు జోగిపేట సిఐ అనిల్‌కుమార్ తెలిపారు. సోమవారం జోగిపేట సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. గత నెల 21న వట్‌పల్లి మండలం పల్వట్ల గ్రామానికి చెందిన సునందమ్మ ఇంట్లో చోరీ జరిగింది. ఇందులో నాలుగు తులాల బంగారు నగలు, ఇరవైవేల నగదు దోచుకెళ్ళారని తెలిపారు. ఈ చోరీ సంఘటనపై సమగ్ర విచారణ చేపట్టి ప్రధాన నిందితుడైన మహీపాల్‌రెడ్డిని బీదర్‌లో అరెస్ట్ చేశామని, ఇందులో మరో ఇద్దరు మోసిన్, సోహైల్‌లు పరారీలో ఉన్నారని తెలిపారు. మహీపాల్‌రెడ్డి సునందమ్మ కొడుకు వెంకట్‌రెడ్డి వద్ద డ్రైవర్‌గా పనిచేశాడని, ఈక్రమంలో అతని ఇంట్లో కేవలం వృద్ధురాలైన సునందమ్మ ఒక్కతే ఉంటుందని గ్రహించి, ఆ ఇంట్లో చోరీచేయాలని ప్లాన్ చేశారు. ఇంతకు ముందే క్రిమినల్ రికార్డు ఉన్న మహీపాల్‌కు గతంలో జైల్లో పరిచయమైన మోసిన్, సోహైల్‌లను ఈ చోరీ కోసం వాడుకున్నాడు. ముగ్గురు కలిసి సునందమ్మ ఇంటికి గతనెల 21న రాత్రికి వెళ్లి, తమను మోహన్ పంపాడని, వర్షం పడుతుండటంతో ఇక్కడ పడుకొని, ఉదయాన్నే లేచి వెళ్తామని చెప్పటంతో సునందమ్మ తలుపు తీసింది. దీంతో వెంటనే ఆమె మెడలో ఉన్న బంగారు పుస్తెల తాడు, బంగారు నగలతో పాటు, ఇరవైవేల నగదును దోచుకెళ్లారు. మహీపాల్‌రెడ్డిని అరెస్ట్‌చేసి చోరీకి గురైన సొమ్మును రికవరీ చేశామని, మిగతా ఇద్దరిని త్వరలో పట్టుకుంటామని సిఐ అనిల్‌కుమార్ తెలిపారు. ఇందులో వట్‌పల్లి ఎస్ఐ విఠల్ పాల్గొన్నారు.

## నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

కొనుగోలు కేంద్రాన్ని తనిఖీచేస్తున్న గ్రామీణాభివృద్ధి అధికారి జ్యోతి

**చౌటకూరు, నవంబరు 11, ప్రభాతవార్త:** ధాన్యం సేకరణలో తప్పులు దొర్లకుండా వివరాలను జాగ్రత్తగా నమోదు చేయాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి జ్యోతి హెచ్చరించారు. చౌటకూరు మండల పరిధిలోని వెండికోలు, వెంకటకిష్టాపూర్, ఉప్పరిగూడెం, బొమ్మారెడ్డిగూడెం, పుల్‌కల్ మండలంలోని మిన్‌పూర్ గ్రామాల్లో నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రాలను జ్యోతి పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వాహకులకు అధికారి జ్యోతి పలు సూచనలు, హెచ్చరికలు జారీ చేశారు. రైతుకు సంబంధించి పూర్తి సమాచారాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేశాక ఎన్ని క్వింటాళ్ళ ధాన్యం కాంటా చేశారో రైతులకు తెలిసేలా వారికి బిల్లులు అందచేయాలన్నారు. పంటల వివరాలు సక్రమంగా నమోదు చేయకపోవడంతోనే సమస్యలు వస్తున్నట్లు రైతుల నుంచి ఫిర్యాదు వస్తున్నాయని విచారం వ్యక్తం చేశారు. కేంద్రాల నిర్వాహకులు అలక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కాంటా చేసి వెంటనే రైసు మిల్లుకు పంపాలన్నారు. క్రమ సంఖ్య ప్రకారం నమోదు చేసుకుని కాంటా చేయాలన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద ప్యాడీ క్లీనర్‌ను ఏర్పాటు చేసుకోవాలని, ధాన్యం నాణ్యత ప్రమాణాలను పాటించేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులతో మాట్లాడి వారి అభిప్రాయాలను సేకరించారు. కార్యక్రమంలో డిపిఎంలు జయశ్రీ, తల్వార్ మల్లేశం, ఎపిఎం శివలక్ష్మి, సిసిలు శేఖర్, శ్రవణ్‌లు ఉన్నారు.

## నూతన ఎఈగా మహేష్ బాధ్యతలు

నూతన ఎఈ మహేష్‌ను సన్మానిస్తున్న దృశ్యం

**రామాయంపేట మున్సిపాలిటీ, నవంబరు 11, ప్రభాతవార్త:** రామాయంపేట మున్సిపాలిటీ ఎఈ సాయిరాం రెడ్డి బదిలీ అయ్యారు. ఈమేరకు సోమవారం నాడు మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మెన్ పల్లె జితేందర్‌గౌడ్ నేతృత్వంలో పాలకవర్గం ఆయనను ఘనంగా సన్మానించి, వీడుకోలు పలికారు. అదేవిధంగా నూతనంగా మున్సిపల్ ఎఈగా బాధ్యతలు చేపట్టిన మహేష్‌కు పాలకవర్గం స్వాగత సన్మానం చేశారు. ఈ సందర్భంగా చైర్మెన్ జితేందర్‌గౌడ్ మాట్లాడుతూ ఇంతకాలం పాటు తమతో కలిసి విధులు నిర్వహించిన సాయిరాం రెడ్డి సేవలను కొనియాడారు. నూతనంగా వచ్చిన మహేష్ మున్సిపాలిటీ పరిధిలో తన సేవలను విజయవంతంగా, ప్రజలకు అందుబాటులో ఉండి అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మెన్ పుట్టి విజయలక్ష్మి యాదగిరి, మున్సిపల్ కమిషనర్ దేవేందర్, మున్సిపల్ మేనేజర్ శ్రీనివాస్, కౌన్సిలర్‌లు బొర్ర అనిల్‌కుమార్, సుందర్‌సింగ్, గజవాడ నాగరాజు, చంద్రపు శోభాకొండల్‌రెడ్డి, దేమె యాదగిరి, మల్యాల కవితా కిషన్, దేవుని జయ రాజు, చింతల రాధాభవాని యాదగిరి, చిలుక గంగాధర్, సరాఫ్ సౌభాగ్య శ్యామ్, కోఆప్షన్ సభ్యులు ఐరేని పృథీరాజ్‌గౌడ్, (బాలు), ఎస్.కె. అహ్మద్‌తో పాటు మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 1600 ఇండ్లలో సర్వే పూర్తి

**కంది, నవంబరు 11, ప్రభాతవార్త:** మండలంలోని ఆయా గ్రామాల్లో 12793 నివాస గృహాలు ఉండగా 1600 ఇండ్లలో సమగ్ర కుటుంబ సర్వేను పూర్తి చేసినట్ల ఎంపిడిఓ శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని 22 గ్రామ పంచాయితీలకు 92 మంది ఎన్యమరేటర్లు, సూపర్‌వైజర్‌ల ఆధ్వర్యంలో సర్వే సజావుగా సాగుతోందన్నారు. ప్రతి ఒక్కరు సర్వేకు తమవంతు సహకారం అందించాలన్నారు.

## విద్యుత్ ప్రమాదంలో గేదె మృతి

**నిజాంపేట, నవంబరు 11, ప్రభాతవార్త:** విద్యుత్ షాక్‌తో గేదె మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని నాగనికుంట తండాలో సోమవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం... తండాకు చెందిన గుగులోత్ సోని బాయ్ తను సాకుతున్న గేదెను ఇంటి నుంచి మేత కోసం వదిలేయగా మేత మేసుకుంటూ వెళుతున్న గేదె ఎల్‌టిలైన్ విద్యుత్ తీగలు తగలడంతో గేదె అక్కడికి అక్కడే మృత్యువాత పడింది. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు సంఘటన స్థలానికి చేరుకుని వెటర్నరీ డాక్టర్ గీతకు సమాచారం అందించగా డాక్టర్ గీత గేదెకు పోస్టుమార్టం నిర్వహించారు. మృత్యువాత పడిన గేదె విలువ 82వేల రూపాయల విలువ గలదన్నారు. విద్యుత్ అధికారులు గుగులోత్ సోనీ బాయి కుటుంబానికి ఆర్థిక